మహిమ న్యూస్

www.mahinewsindia.com

MAHI NEWS

Epaper: https://epaper.mahinewsindia.com

తెలుగు దినపత్రిక



ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. | సంపుటి : 02 | సంచిక : 193 | ఎడిటర్ : నీలి రామసుబ్బయ్య, | పేజిలు : 8, | వెల రూ. 2 | మంగళవారం -13 - అక్టోబర్ - 2026

Published From :YSR Kadapa circulated by Kurnool I Anatapuram I Chittoor I East & West Godavari I Guntur I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad & Telangana

GOVERNMENT OF ANDHRA PRADESH · సత్యమేవ జయతే · IAS

2లో

11 మంది ఐపీఎస్‌లకు పోస్టింగ్‌లు.. ఆమ్రపాలికి కీలక శాఖ

- ఆమ్రపాలికి పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి బాధ్యతలు
- ఆగస్టు నుంచి జీఏడీలో వెయిటింగ్‌లో ఉన్న ఆమ్రపాలి
- తొమ్మిది మందికి కొత్త పోస్టింగ్‌లు
- మరో ఇద్దరు ఐపీఎస్‌లకు అదనపు బాధ్యతలు

తిరుపతిలో రూ.3,222 కోట్ల అభివృద్ధి పనులకు సీఎం చంద్రబాబు శ్రీకారం

తిరుపతి స్వరూపం మారనుంది.. వేల కోట్ల ప్రాజెక్టులకు చంద్రబాబు శంకుస్థాపన

- అలిపిరి వద్ద భారీ ఇంటిగ్రేటెడ్ పిలిగ్రిమ్ టౌన్‌షిప్ నిర్మాణానికి శంకుస్థాపన
- టీటీడీ ఉద్యోగుల కోసం 418 ఎకరాల్లో నివాస లేఅవుట్ అభివృద్ధికి ఆమోదం
- భక్తుల సమాచారం కోసం 'వెంకటాద్రి యాప్'ను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి
- నగరంలో రూ.242 కోట్లతో 9 మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణానికి శ్రీకారం



అమరావతి: కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి కొలువైన తిరుపతి అభివృద్ధిలో మరో కీలక అధ్యాయం మొదలైంది. 'తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ' (తుడా) పరిధిలో సుమారు రూ.3,222 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం శ్రీకారం చుట్టారు. అమరావతి సచివాలయం నుంచి వర్చువల్ విధానంలో ఆయన ఈ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భక్తులకు సమగ్ర సమాచారం అందించేందుకు రూపొందించిన 'వెంకటాద్రి' యాప్‌ను కూడా సీఎం ఆవిష్కరించారు. ఈ వర్చువల్ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈఓ ఎం. రవిచంద్ర, పాలకమండలి సభ్యులు, తిరుపతి జిల్లా కలెక్టర్, 'తుడా' అధికారులు పాల్గొన్నారు. మిగతా 2 లో

ఏపీ మేయర్ ఎన్నికల రిజర్వేషన్లు ఖరారు.. విశాఖకు మహిళ, విజయవాడ అన్‌రిజర్వ్‌డ్



2లో

- ఆంధ్రప్రదేశ్‌లోని 17 కార్పొరేషన్లకు మేయర్ రిజర్వేషన్లు ఖరారు
- ఈ మేరకు పురపాలక శాఖ నుంచి జీవో నెం. 252 జారీ
- 5 బీసీ, 2 ఎస్సీ, 1 ఎస్టీ, 5 జనరల్ మహిళలకు కేటాయింపు
- విజయవాడ, తిరుపతి సహా 4 స్థానాలు అన్‌రిజర్వ్‌డ్‌గా ప్రకటన
- త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం

ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్‌పై తెలంగాణ ప్రభుత్వం పునరాలోచన..



2లో

చార్జీల తగ్గింపుకు కసరత్తు

ఆర్టీసీ-మెట్రో పాస్ చార్జీలపై సమీక్ష

త్వరలో కొత్త ధరలు ప్రకటిస్తామన్న మంత్రి పొన్నం

ధరలు భారంగా ఉన్నాయని ప్రజల నుంచి ఫిర్యాదులు



2లో

రైతు బజార్లలో కిలో సన్నబియ్యం రూ.50కే..

ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం

ఏపీ రైతు బజార్లలో కెఎన్ఎం సన్నబియ్యం విక్రయాలు

రూ.49కే అందుబాటులో ఉన్న బీపీటీ బియ్యం

పెరిగిన ధరల నుంచి ప్రజలకు ఉపశమనం కల్పించే చర్య



2లో

జేఎన్‌యూ ఘటన: రాహుల్,

ప్రియాంక మౌనంపై పురందేశ్వరి ఫైర్

- కాంగ్రెస్ ఎంపీపై లైంగిక వేధింపుల ఆరోపణలు
- నిందిత ఎంపీని కాంగ్రెస్ కాపాడుతోందన్న పురందేశ్వరి
- మహిళల భద్రత విషయంలో కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని విమర్శ

200 మంది కేంద్ర ప్రభుత్వ అధికారులు

మాతో టచ్‌లో ఉన్నారు..

జ్ఞానేశ్ కుమార్ తనకు సందేశాలు పంపుతున్నారని రాహుల్ వెల్లడి

- రాహుల్ సంచలన వ్యాఖ్యలు
- అప్రూవర్‌గా మారాలని జ్ఞానేశ్‌కు రాహుల్ సూచన
- మోదీ, అమిత్ షా, దోవల్, అదానీ కలిసి ఒత్తిడి తెస్తున్నారని ఆరోపణలు
- జ్ఞానేశ్ అసలు నేరస్థుడు కాదని.. సూత్రధారులు వేరే ఉన్నారని వ్యాఖ్య
- సీఈసీని తొలగించే వరకు ఆందోళన కొనసాగుతుందని స్పష్టీకరణ



ఢిల్లీ: లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. ఆయన మిగతా 2 లో

ఫారం-6పై ఎటువంటి తీర్పు వెలువరించలేదు: సుప్రీం కోర్టు

రికార్డుల్ని తమకు సమర్పించినప్పుడు ఆ మార్పుల్ని ఎవరు చేశారో పరిశీలించి, తగిన చర్యలు తీసుకోవాలి

బిహార్ 'సర్' ప్రక్రియ విషయంలో సుప్రీం కోర్టు ఎన్నికల కమిషన్‌పై ఆగ్రహం వ్యక్తం

బిహార్ సర్‌కు సంబంధించిన తీర్పు వెలువరించినప్పుడు అందులో కొత్త ఫారం-6 లేదు

ఓటర్ల నమోదు ప్రక్రియలో ఈసీ ఏకపక్ష నిర్ణయాలపై చర్యలకు ఆదేశించాలని విజ్ఞప్తి



ఢిల్లీ: బిహార్ 'సర్' ప్రక్రియ విషయంలో సుప్రీం కోర్టు ఎన్నికల కమిషన్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది. మిగతా 2 లో



2లో

ప్రజల దాహం కంటే

బీర్లే ముఖ్యమా?

ప్రభుత్వంపై హరీశ్ రావు ఫైర్

- సింగూరు ప్రాజెక్టు నీటిని మళ్లిస్తున్నారని హరీశ్ రావు ఆరోపణ
- రాష్ట్రంలో కరెంట్ కోతలకు ప్రభుత్వ వైఫల్యమే కారణమన్న మాజీ మంత్రి
- కోట్ల మంది తాగునీటి అవసరాలను పట్టించుకోవడం లేదని విమర్శ

ఈడీ, సీబీఐ సరిపోక ఈసీని వాడుకుంటున్నారు

కేంద్ర ప్రభుత్వం ఈసీని దుర్వినియోగం చేస్తోందన్న సీఎం రేవంత్

- కేంద్రంపై రేవంత్ రెడ్డి ఫైర్
- ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ పేరుతో బీజేపీ వ్యతిరేకుల ఓట్ల తొలగిస్తున్నారని ఆరోపణ
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు
- బీజేపీని వ్యతిరేకించే యువత, నిరుద్యోగులు, పేదలను లక్ష్యంగా చేసుకున్నారు
- అలాంటి అధికారిని తొలగించడానికి ప్రధాని నరేంద్ర మోదీకి అభ్యంతరం ఎందుకు
- ధనవంతులు-బీజేపీ మద్దతుదారులు ఒకవైపు, పేదలు-గిరిజనులు-బీజేపీ వ్యతిరేకులు మరోవైపు అనేలా రెండు వర్గాలుగా చూస్తోంది



హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈడీ, సీబీఐ, ఐటీ సంస్థలు సరిపోవన్నట్లుగా ఇప్పుడు మోదీ సర్కార్ ఎన్నికల కమిషన్‌ను (ఈసీ) కూడా దుర్వినియోగం చేస్తోందని ఆయన ఆరోపించారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ మిగతా 2 లో

రోడ్లపై కాదు.. ఆధారాలతో

ఈసీ వద్దకు వెళ్లండి: ఈటల రాజేందర్



2లో

- ఢిల్లీలో ఇండియా కూటమి నిరసనలపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ స్పందన
- ఆందోళనలతో ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని వ్యాఖ్య
- ఆధారాలుంటే ఎన్నికల సంఘాన్ని కలవాలని ప్రతిపక్షాలకు సూచన

హైదరాబాద్: ఇండియా కూటమి ఆధ్వర్యంలో ఢిల్లీలో చేపట్టిన నిరసన కార్యక్రమాలపై బీజేపీ మల్కాజ్‌గిరి మిగతా 2 లో

ఫారం-6పై ఎటువంటి తీర్పు వెలువరించలేదు: సుప్రీం కోర్టు

ఢిల్లీ: బిహార్ 'సర్' ప్రక్రియ విషయంలో సుప్రీం కోర్టు ఎన్నికల కమిషన్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది. కొత్త ఓటర్లుగా పేర్లు నమోదు చేసుకోవాలనుకునేవారు నింపాల్సిన ఫారం-6 లో తాము ఎలాంటి సవరణలనూ ఆమోదించలేదని స్పష్టం చేసింది. తాము బిహార్ సర్‌కు సంబంధించిన తీర్పు వెలువరించినప్పుడు అందులో కొత్త ఫారం-6 లేదని పేర్కొంది. రికార్డుల్ని తమకు సమర్పించినప్పుడు ఆ మార్పుల్ని ఎవరు చేశారో పరిశీలించి, తగిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపింది. కొత్త ఫారం డిక్లరేషన్‌కు సుప్రీంకోర్టు ఆమోదం ఉందంటూ ఎన్నికల సంఘం చేసిన ప్రకటనని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం తప్పుబట్టింది. చట్టబద్ధమైన నిబంధనలు సవరించకుండా ఫారం-6 లో ఎన్నికల సంఘం మార్పులు చేసిందని పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టుకు వెల్లడించారు. అంతటితో ఆగకుండా అందరినీ నమ్మించేందుకు ఆ ఫారాన్ని సుప్రీంకోర్టు ఆమోదించినట్లు సెప్టెంబరు 26న తప్పుడు ప్రకటన జారీ చేసిందని ఆరోపించారు. ఓటర్ల నమోదు ప్రక్రియలో ఈసీ ఏకపక్ష నిర్ణయాలపై చర్యలకు ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై విచారణ జరిపిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం పై వ్యాఖ్యలు చేసింది.

రేవంత్ సర్కారుపై రాజగోపాల్ రెడ్డి ఫైర్..
టెండర్లలో భారీ అవకతవకలంటూ ఆరోపణ!

హైదరాబాద్: తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి బయటపడ్డాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ ఆధ్వర్యంలో చేపట్టిన రూ.3,296 కోట్ల రేడియల్ రోడ్-2 నిర్మాణ టెండర్ల ప్రక్రియలో భారీ అవకతవకలు జరిగాయని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. తమ సొంత ప్రభుత్వంలోనే ఇలాంటి పరిస్థితులు రావడం బాధాకరమని ఆయన అన్నారు. మూడు ప్యాకేజీలకు గానూ ఇతర సంస్థల కన్నా రూ.600 కోట్లు తక్కువకు తమ కంపెనీ బిడ్లు దాఖలు చేసినప్పటికీ, ఉద్దేశపూర్వకంగా నిబంధనలు పెట్టి తమను పక్కనపెట్టారని ఆరోపించారు. స్వయంగా ముఖ్యమంత్రి పర్యవేక్షణలో ఉండే శాఖలోనే ఈ దోపిడీ జరగడం దారుణమని ఆయన వ్యాఖ్యానించారు. టెండర్లలో పాల్గొనవద్దని ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి తనకు ఫోన్లు వచ్చాయని, అయినా తాము పోటీలో నిలిచామని రాజగోపాల్ రెడ్డి వెల్లడించారు. ఈ వ్యవహారాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళతానని స్పష్టం చేశారు. తమ కంపెనీని అనర్హులుగా ప్రకటించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, న్యాయపరంగా సుప్రీంకోర్టు వరకు పోరాడతానని హెచ్చరించారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో జరిగిన పరిణామాలనే ఇది గుర్తు చేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తప్పు ఎవరు చేసినా తప్పేనని, రేవంత్ రెడ్డి చేసినా తాను వ్యతిరేకిస్తానని పేర్కొన్నారు. ఇలాంటి దోపిడీ జరుగుతుంటే ఢిల్లీలో పార్టీ నిర్వహించే నిరసనలో ఎలా పాల్గొంటానని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లోనే ఉంటూ ఇటువంటి అవినీతిపై పోరాటం కొనసాగిస్తానని రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు.

స్థానిక ఎన్నికలు.. పొత్తు ప్రకారం జనసైనికులు పోటీలో నిలుస్తారు: పవన్

పోలవరం: స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీల నుంచి పోటీచేసే అభ్యర్థులను గెలిపించి సత్తా చాటాలని ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. కాకవాడ గ్రామసభలో ఆయన ప్రసంగిస్తూ.. స్థానిక సమరానికి శంఖారావం పూరించారు. స్థానిక ఎన్నికల్లో జనసైనికులు పొత్తు ప్రకారం పోటీ చేస్తారని.. తెదేపా, భాజపా నాయకులకు ఎంత గౌరవం ఇస్తారో, తమ వాళ్లకూ అంతే మద్దతివ్వాలని కోరారు. 'నేను పార్టీ పెట్టినప్పుడు ఇక్కడి యువతంతా ఎర్ర తువ్వాళ్లు వేసుకుని వచ్చింది. అధికారంలోకి వస్తామో రామో తెలియదు.. వారికి తెలిసింది పోరాటమే.. ఆ ఎర్ర కండువానే ఆయుధం. 2014లో ఒక్క పదవీ ఆశించకుండా కూటమికి పనిచేశారు. గత ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరించి చంద్రబాబును జైల్లో పెట్టింది. రోడ్లపైకి ఎవరూ రాని సమయంలో జనసైనికులు, వీరమహిళలు వచ్చి రాష్ట్రానికి భరోసా, ధైర్యం ఇచ్చారు. గత ఎన్నికల్లో నేను రాష్ట్ర భవిష్యత్తు కోసం పనిచేశా. స్థానిక ఎన్నికలు మీ భవిష్యత్తు.. మీ అవసరాల కోసం' అని అన్నారు. మూడు పార్టీలూ బాగుండాలని.. ఇప్పటికే జనసేన చాలా త్యాగం చేసిందని.. జనసైనికులు, వీరమహిళలు తగిన ప్రాతినిధ్యం వహించేందుకు అండగా నిలవాలని కోరారు.

రౌడీలు, రప్పా రప్పా టీంలకు బుద్ధి చెప్పాలి

అమరావతి: 'ఎన్నికలు దగ్గర పడుతుండటం, ఇమేజ్ పడిపోవడంతో గొడ్డలి పార్టీ ఫేక్ ప్రచారాల్ని ముమ్మరం చేస్తోంది. ఈ ఎన్నికలతో ఆ పార్టీకి, అభివృద్ధి నిరోధకులకు, రౌడీలు, రప్పా రప్పా టీంలకు బుద్ధి చెప్పాలి. అక్రమంగా ఆస్తులు సంపాదించిన జగన్ మనపై ఆరోపణలు చేస్తున్నారు. వివేకానందరెడ్డి హత్య కేసులో అంతిమ లబ్ధిదారయిన జగన్.. ఆ విషయంలో ప్రజల్ని మభ్యపెట్టాలని చూస్తున్నారు. ఈడీని మనమే పంపామని ఆరోపణలు చేస్తున్నారు' అని చంద్రబాబు విరుచుకుపడ్డారు. 'బీసీలకు రిజర్వేషన్లు దక్కకూడదని, స్థానిక ఎన్నికలు జరగకూడదని గొడ్డలి పార్టీ న్యాయస్థానాలకు వెళ్లింది. రాష్ట్ర జనాభాలో 50 శాతం ఉన్న వెనుకబడిన వర్గాలకు అన్యాయం చేయాలని చూసింది. జగన్ అధికారంలో ఉన్నప్పుడు.. 34 శాతంగా ఉన్న బీసీ రిజర్వేషన్లను 24 శాతానికి కుదించారు. వారికి న్యాయం చేయాలని ఏనాడూ భావించలేదు' అని సీఎం దుయ్యబట్టారు. రాజీవ్‌రంజన్ మిశ్రా కమిటీ సిఫార్సులు ఆమోదించి, బీసీలకు వీలైనంత ఎక్కువ మేలు చేస్తున్నామని, ఎస్సీ, ఎస్టీల ప్రయోజనాలకు భంగం కలిగించకుండా బీసీలకు న్యాయం చేస్తున్నామని తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ పరంగా బీసీలకు 40 శాతం వరకూ రిజర్వేషన్లు కల్పించేలా కసరత్తు చేస్తున్నామని తెదేపా అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం చేసిన మంచి తెలిసేలా 'జయహో బీసీ.. జనాభాలో సగం-కూటమి ఇచ్చింది బలం' నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. 2024 సార్వత్రిక ఎన్నికల కంటే ఈసారి ఎక్కువ శాతం ఓట్లు పడాలని, ఇదే నేతల పనితీరుకు కొలమానమని పేర్కొన్నారు. దీన్నిబట్టే నేతలకు రేటింగ్స్ ఇస్తామని తెలిపారు. స్థానిక ఎన్నికల సన్నద్ధతపై మంత్రులు, తెదేపా ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా పార్టీ అధ్యక్షులు, ఇన్‌ఛార్జులు, నియోజకవర్గ పరిశీలకులు, ముఖ్యనేతలతో ఆదివారం చంద్రబాబు వర్చువల్‌గా మాట్లాడారు. స్థానిక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రచారం, కూటమి పార్టీలతో సమన్వయం, ప్రత్యర్థి పార్టీల దుష్ప్రచారాల్ని తిప్పికొట్టడంపై వారికి దిశానిర్దేశం చేశారు.

'మనం కూటమిలో ఉన్నాం. మిత్రధర్మం చాలా ముఖ్యం. కూటమి పార్టీల మధ్య పైస్థాయిలో ఎలాంటి సమన్వయం ఉందో.. క్షేత్రస్థాయిలోనూ అలాగే ఉండాలి. విభేదాలు, అపోహలకు తావివ్వొద్దు. నియోజకవర్గ, జిల్లా స్థాయుల్లో మూడు పార్టీలు కలిసి సమన్వయ కమిటీలు ఏర్పాటు చేసుకోవాలి. మిత్రపక్షాలతో కలిసి ఎన్నికల ప్రచారం చేయాలి. తటస్థుల్ని పార్టీ సానుభూతిపరులుగా మార్చాలి. ప్రత్యర్థి పార్టీల వారిని తటస్థుల్ని చేయాలి. రాబోయే 50 రోజులు ఎవరికీ మినహాయింపు లేదు. కూటమి అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పని చేయాలి. గెలుపు, నిజాయతీ, సమర్థత, సోషల్ రీ-ఇంజినీరింగ్ వంటి అంశాల్ని బేరీజు వేసుకుని అభ్యర్థుల్ని ఎంపిక చేస్తాం. గొడ్డలి పార్టీ మూతపడేలా ఈ ఎన్నికల్లో కూటమి గెలుపు ఉండాలి. ఎమ్మెల్యేలంతా కార్యకర్తల మనోభావాల్ని బట్టి నడుచుకోవాలి' అని చంద్రబాబు పేర్కొన్నారు.

డ్రామాలాడేవారిని ఉపేక్షించం..

నిజాయతీగా పనిచేయకుండా.. డ్రామాలాడేవారిని ఉపేక్షించబోమని చంద్రబాబు హెచ్చరించారు. 'స్థానిక ఎన్నికల్ని ఆషామాషీగా తీసుకోవద్దు. కూటమి బలం మరింత పెరగాలంటే ఈ ఎన్నికలు కీలకం. ఇప్పటివరకూ సంక్షేమం కోసం రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేశాం. చెత్త పన్ను రద్దు చేశాం. చక్కటి రోడ్లు వేశాం. ఇరిగేషన్‌కు పూర్వ వైభవం తెచ్చాం. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని పూర్తి చేశాం. పల్లె పండుగకు రూ.11 వేల కోట్లు, జేజేఎం పనులకు రూ.30 వేల కోట్లతో శంకుస్థాపన చేశాం. 5 లక్షల ఇళ్లల్లో సామూహిక గృహప్రవేశాలు చేపట్టాం. మరో 3 లక్షల ఇళ్లకు భూమిపూజ చేశాం. పుర, నగరపాలికల్లో మౌలిక సదుపాయాల కోసం రూ.11,359 కోట్ల విలువైన పనులు చేపట్టాం. 16.48 లక్షల ఎకరాలను 22ఏ నుంచి తొలగించాం. ఇవన్నీ ప్రజల్లోకి తీసుకెళ్లాలి' అని చంద్రబాబుపేర్కొన్నారు. ఓటరు జాబితా సిద్ధం చేసుకోవాలని, వాటిని క్లస్టర్‌ల వరకూ అందేలా చూడాలన్నారు.

2027 రుతుపవనాల నాటికి
గోవాలో కాంగ్రెస్ సర్కార్!

హైదరాబాద్:'రావణుడు బీజేపీ అయితే, రాముడు కాంగ్రెస్. బీజేపీని ఓడించాలంటే ప్రజలంతా కాంగ్రెస్‌కు మద్దతుగా నిలవాలి. గోవా ప్రజలు రెండుసార్లు బీజేపీని నమ్మి మోసపోయారు. మూడోసారి ఆ పార్టీని నమ్మొద్దు. గోవాలో కాంగ్రెస్‌కు కాకుండా ఇతర పార్టీలకు ఓటు వేసినా అది చివరకు బీజేపీకే ప్రయోజనం చేకూరుస్తుంది. జ్ఞానేశ్ కుమార్ పేరుతో పేదల ఓట్లను తొలగించే ప్రయత్నం జరుగుతోంది. పేదలు, దళితులు, మైనారిటీలు, ఆదివాసీల ఓట్లను తొలగిస్తున్నారు. గోవాలో.. కాంగ్రెస్ పార్టీ కోసం కాదు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడాలి. దేశంలో నైరుతి రుతుపవనాలు తొలుత కేరళలో ప్రవేశించి, ఆ తర్వాత గోవాకు చేరుకుంటాయి. 2026 రుతుపవనాల సమయంలో కేరళలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. 2027 రుతుపవనాల నాటికి గోవాలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుంది..' అని ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేశారు. గోవా నుంచి ఢిల్లీ ఎర్రకోట వరకు త్రివర్ణ పతాకం ఎగరడం ఖాయమని అన్నారు.

గోవాలో భూముల అన్యా క్రాంతం, డ్రగ్స్ దందాకు బీజేపీ ప్రభుత్వం అండగా నిలిచిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆక్రమణలు, కబ్జాలతో భూములు అన్యాక్రాంతం అయ్యాయని, మరోవైపు డ్రగ్స్ వ్యాపారానికి బీజేపీ ప్రభుత్వం పూర్తి మద్దతు ఇవ్వడంతో యువత తప్పుదారి పట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులను సరిచేయాలంటే కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చి ఎన్నికల్లో గెలిపించాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో ఈగల్ ఫోర్స్ ఏర్పాటు చేసి డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. గోవాలో భూముల అన్యాక్రాంతం, పర్యావరణం, సంస్కృతి, వారసత్వం, స్థానిక గుర్తింపును పరిరక్షించాలనే లక్ష్యంతో గోవా కాంగ్రెస్ నిర్వహిస్తున్న 'గోయ్ రాఖోన్స్' యాత్రలో భాగంగా నిర్వహించిన బహిరంగ సభలో సీఎం పాల్గొని ప్రసంగించారు.

'గోవా ప్రజలు బీజేపీ పాలనతో విసిగిపోయారు. మరోసారి ఆ పార్టీ అధికారంలోకి వస్తే స్థానిక ప్రజలు తమ ప్రాంతంలోనే పరాయివారిగా మారే పరిస్థితి ఏర్పడుతుంది. రాహుల్ గాంధీ గోవాకు రావాల్సి ఉన్నప్పటికీ, ఢిల్లీలో నిరసన కార్య క్రమాల నేపథ్యంలో రాలేకపోయారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ ప్రతినిధిగా నన్ను గోవాకు పంపించారు. గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ రాష్ట్రా న్ని అభివృద్ధి చేయకుండా ఆస్తులను ఇతరులకు అప్పగించే పనిలో ఉన్నారు.

అందుకే ప్రజలు ఆయన్ను 'ప్రాపర్టీ సావంత్' అని పిలుస్తున్నారు. 'నషా ముక్త్ భారత్' గురించి మాట్లాడుతున్న ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా గోవాలో ఈ సమస్యను ఎందుకు అరికట్టడం లేదు? అనేది ప్రజలు ఆలోచించుకోవాలి. గోవా యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి..' అని రేవంత్‌రెడ్డి అన్నారు.

తిరుపతిలో రూ.3,222 కోట్ల అభివృద్ధి పనులకు సీఎం చంద్రబాబు శ్రీకారం

అమరావతి: కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి కొలువైన తిరుపతి అభివృద్ధిలో మరో కీలక అధ్యాయం మొదలైంది. 'తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ' (తుడా) పరిధిలో సుమారు రూ.3,222 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం శ్రీకారం చుట్టారు. అమరావతి సచివాలయం నుంచి వర్చువల్ విధానంలో ఆయన ఈ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భక్తులకు సమగ్ర సమాచారం అందించేందుకు రూపొందించిన 'వెంకటాద్రి' యాప్‌ను కూడా సీఎం ఆవిష్కరించారు. ఈ వర్చువల్ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈఓ ఎం. రవిచంద్ర, పాలకమండలి సభ్యులు, తిరుపతి జిల్లా కలెక్టర్, 'తుడా' అధికారులు పాల్గొన్నారు.

భక్తుల సౌకర్యార్థం ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్

తిరుమలపై రద్దీని తగ్గించి, భక్తులకు ప్రపంచస్థాయి సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో అలిపిరి వద్ద భారీ ఇంటిగ్రేటెడ్ పిలిగ్రిమ్ టౌన్‌షిప్ నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా రూ.1,332 కోట్లతో యాత్రికుల కోసం వసతి సముదాయాలు నిర్మించనున్నారు. నాలుగు బ్లాకుల్లో 2,700 గదులు అందుబాటులోకి రానుండగా, రోజుకు 15 వేల మందికి పైగా భక్తులు బస చేసే వీలుంటుంది. రూ.160 కోట్లతో నిర్మించే నూతన అన్నప్రసాద కేంద్రంలో ఒకేసారి 6 వేల మంది భక్తులు భోజనం చేయవచ్చు. వీటితో పాటు రూ.486 కోట్లతో నాలుగు పిలిగ్రిమ్ ఎమినిటీస్ కాంప్లెక్స్‌లు నిర్మిస్తారు. వీటిలో ఒకేసారి 16 వేల మంది భక్తులు విశ్రాంతి తీసుకోవచ్చు. రూ.311 కోట్లతో 4,500 వాహనాలు నిలిపేలా బహుళ అంతస్తుల పార్కింగ్ సముదాయం, రూ.90 కోట్లతో 30 బస్ బేలతో కూడిన ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్ట్ టెర్మినల్ కూడా ఈ టౌన్‌షిప్‌లో భాగంగా ఉండనున్నాయి.

టీటీడీ ఉద్యోగుల సొంతింటి కల సాకారం

దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న టీటీడీ ఉద్యోగుల సొంతింటి కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. 418 ఎకరాల విస్తీర్ణంలో 5,192 మంది టీటీడీ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలను కేటాయించే లేఅవుట్ అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. ఈ లేఅవుట్‌లో అంతర్గత బీటీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతుల కల్పనకు రూ.230 కోట్లు వెచ్చించనున్నారు.

మాస్టర్ ప్లాన్ రహదారులతో మారనున్న రూపురేఖలు

తిరుపతి నగరంలో ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు రూ.242 కోట్ల వ్యయంతో 9 మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణ పనులను కూడా సీఎం ప్రారంభించారు. ఈ రహదారుల నిర్మాణం పూర్తయితే నగరంలో రవాణా వ్యవస్థ మరింత మెరుగుపడనుంది. ప్రత్యేకించి తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయానికి మూడు కొత్త మాస్టర్ ప్లాన్ రహదారులను నిర్మించనున్నారు. ఈ సమగ్ర ప్రాజెక్టుల ద్వారా తిరుపతిని ఆధ్యాత్మిక రాజధానిగా మాత్రమే కాకుండా, అత్యుత్తమ మౌలిక వసతులున్న నగరంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

200 మంది కేంద్ర ప్రభుత్వ అధికారులు మాతో టచ్‌లో ఉన్నారు..

ఢిల్లీ: లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. ఆయన తనకు సందేశాలు పంపిస్తున్నారని వెల్లడించారు. "మీరు చేసిన తప్పును అంగీకరించి అప్రూవర్‌గా మారండి. మీరు ప్రధాన నేరస్థుడు కాదు. మీ వెనుక అసలు సూత్రధారులు ఉన్నారు" అని జ్ఞానేశ్ కుమార్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. సోమవారం సుప్రీంకోర్టు వైపు ప్రతిపక్ష కూటమి చేపట్టిన మార్చ్‌కు ముందు మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

సీఈసీ సందేశాలు పంపిస్తున్నారు

జ్ఞానేశ్ కుమార్ తనను సంప్రదించారా? సందేశాలు పంపారా? అని ఓ విలేకరి అడగ్గా.. రాహుల్ అవునని సమాధానమిచ్చారు. తాను నిర్వహిస్తున్న మీడియా సమావేశాన్ని కూడా ఆయన చూస్తున్నారని వ్యాఖ్యానించారు. అయితే, తనకు వచ్చిన సందేశాల్లోని వివరాలను మాత్రం వెల్లడించలేదు.

మోదీ, అమిత్ షా ఒత్తిడి ఉందని ఆరోపణ

జ్ఞానేశ్ కుమార్‌పై ప్రభుత్వం రక్షణ కవచంలా నిలుస్తోందని రాహుల్ ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ ఒత్తిడితోనే సీఈసీ వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఈ ఆరోపణలకు సంబంధించి ఆయన ఆధారాలను మీడియా ముందు వెల్లడించలేదు.

సుప్రీంకోర్టుకు ప్రతిపక్ష కూటమి

ఎన్నికల సంఘంపై వచ్చిన ఆరోపణలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇండియా కూటమి సోమవారం సుప్రీంకోర్టు వైపు మార్చ్ చేపట్టింది. ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయంటూ రాహుల్ గతంలోనూ ఆరోపణలు చేశారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత దెబ్బతింటోందని విమర్శించారు. సీఈసీని తొలగించాలని, ఎన్నికల వ్యవస్థలో మార్పులు తీసుకురావాలని డిమాండ్ చేశారు.

200 మంది అధికారులు టచ్‌లో

కేంద్ర ప్రభుత్వంలోని సుమారు 200 మంది అధికారులు ప్రతిపక్ష నేతలతో సంప్రదింపులు జరుపుతున్నారని రాహుల్ తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ), విదేశాంగ శాఖకు చెందిన అధికారులు కూడా ఇందులో ఉన్నారని పేర్కొన్నారు. వారే తమకు సమాచారం అందిస్తున్నారని తెలిపారు. అయితే, ఈ వాదనకు సంబంధించిన వివరాలను వెల్లడించలేదు.

రాజ్యాంగ పరిరక్షణకు అందరూ కలిసి రావాలి

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తాను ఎన్నికల నిష్పాక్షికతపై ఆందోళన వ్యక్తం చేస్తూ భారత ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశామని రాహుల్ చెప్పారు. పిటిషన్ దాఖలు చేయాలని సీజేఐ సూచించినట్లు తెలిపారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడే వారికి రాజకీయాలకు అతీతంగా మద్దతిస్తామని స్పష్టం చేశారు. జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించే వరకు తమ ఆందోళన ఆగదని రాహుల్ ప్రకటించారు. ఆ తర్వాత ప్రధాని మోదీ, అమిత్ షాపై కూడా తమ పోరాటం కొనసాగుతుందని వ్యాఖ్యానించారు.

ప్రజల దాహం కంటే బీర్లే ముఖ్యమా?
ప్రభుత్వంపై హరీశ్ రావు ఫైర్

హైదరాబాద్: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కోట్ల మంది ప్రజల తాగునీటి అవసరాలను పక్కనపెట్టి, బీర్ ఫ్యాక్టరీలకు ప్రాధాన్యత ఇస్తున్నారని ఆయన ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన... ప్రభుత్వం నీటి, విద్యుత్ నిర్వహణలో పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. సింగూరు ప్రాజెక్టు అంశాన్ని హరీశ్ రావు ప్రత్యేకంగా ప్రస్తావించారు. మరమ్మతుల పేరుతో ప్రాజెక్టు నుంచి 29 టీఎంసీల నీటిని ఖాళీ చేసి, పనులను అసంపూర్తిగా వదిలేశారని విమర్శించారు. ప్రస్తుతం ప్రాజెక్టులో కేవలం 3 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉన్నా, దానిని బీర్ ఫ్యాక్టరీలకు తరలిస్తున్నారని ఆరోపించారు. ఈ చర్య వల్ల హైదరాబాద్, రంగారెడ్డి, కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్ జిల్లాల ప్రజల తాగునీటి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఫల్యాల వల్లే రాష్ట్రంలో కరెంట్ కోతలు పెరిగాయని, ప్రభుత్వ విధానాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని హరీశ్ రావు అన్నారు. ఎల్ నినో ప్రభావంపై ముందుగానే హెచ్చరికలు ఉన్నప్పటికీ, దేవాదుల, కల్వకుర్తి వద్ద నీటిని లిఫ్ట్ చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని, ఇది కృత్రిమ కరవుకు దారితీసిందని దుయ్యబట్టారు. మద్యం కంపెనీలకు నీటి కొరత రాకూడదని ఎక్సైజ్ మంత్రి వ్యాఖ్యానించడాన్ని ఆయన తప్పుపట్టారు.

ఏపీ మేయర్ ఎన్నికల రిజర్వేషన్లు ఖరారు..
విశాఖకు మహిళ, విజయవాడ అన్‌రిజర్వ్‌డ్

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల దిశగా ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. రాష్ట్రంలోని 17 మున్సిపల్ కార్పొరేషన్లకు మేయర్ పదవుల రిజర్వేషన్లను ఖరారు చేస్తూ సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మేరకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ జీవో నెం. 252ను జారీ చేసింది. దీని ప్రకారం వివిధ సామాజిక వర్గాలకు, మహిళలకు కేటాయింపులు జరిగాయి.

రాష్ట్రంలోని మొత్తం 17 కార్పొరేషన్లలో 5 స్థానాలను బీసీలకు, 2 ఎస్సీలకు, 1 ఎస్టీకి కేటాయించారు. మరో 5 కార్పొరేషన్లను జనరల్ కేటగిరీ మహిళలకు రిజర్వ్ చేయగా, మిగిలిన 4 స్థానాలను అన్‌రిజర్వ్‌డ్‌గా (రిజర్వేషన్ లేనివి) ప్రకటించారు. ఈ రిజర్వేషన్ల ఖరారుతో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ వేగవంతం కానుందని భావిస్తున్నారు.

రిజర్వేషన్ల కేటాయింపు ఇలా ఉంది:
ఎస్టీ (ఒకటి): మంగళగిరి-తాడేపల్లి
ఎస్సీ (రెండు): రాజమహేంద్రవరం, కర్నూలు
బీసీ - మహిళ (రెండు): మచిలీపట్నం, కాకినాడ
బీసీ - జనరల్ (మూడు): అనంతపురం, చిత్తూరు, ఏలూరు
జనరల్ - మహిళ (ఐదు): విజయనగరం, శ్రీకాకుళం, గుంటూరు, కడప, విశాఖపట్నం
అన్‌రిజర్వ్‌డ్ (నాలుగు): తిరుపతి, విజయవాడ, ఒంగోలు, నెల్లూరు

ఈ తాజా నోటిఫికేషన్‌తో ప్రధాన నగరాలైన విశాఖపట్నం, గుంటూరు మేయర్ పీఠాలు మహిళలకు దక్కనుండగా, విజయవాడ, తిరుపతి వంటి కీలక కార్పొరేషన్లు అన్‌రిజర్వ్‌డ్ కేటగిరీలో ఉన్నాయి. మేయర్ పదవుల రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తికావడంతో, త్వరలోనే ఎన్నికల షెడ్యూల్‌పై స్పష్టత వచ్చే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

ఈడీ, సీబీఐ సరిపోక ఈసీని వాడుకుంటున్నారు
కేంద్రంపై రేవంత్ రెడ్డి ఫైర్

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈడీ, సీబీఐ, ఐటీ సంస్థలు సరిపోవన్నట్లుగా ఇప్పుడు మోదీ సర్కార్ ఎన్నికల కమిషన్‌ను (ఈసీ) కూడా దుర్వినియోగం చేస్తోందని ఆయన ఆరోపించారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను అడ్డం పెట్టుకుని బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నవారి ఓట్లను తొలగించే బాధ్యతను చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు అప్పగించారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. 1950లో ప్రజలకు ఓటు హక్కు కల్పించడానికి తీసుకొచ్చిన ఈ ప్రక్రియను, ఇప్పుడు బీజేపీ తన వ్యతిరేకుల ఓట్లను తొలగించడానికి వాడుకుంటోందని విమర్శించారు. ఈ చర్యల ద్వారా.. బీజేపీని వ్యతిరేకించే యువత, నిరుద్యోగులు, పేదలను లక్ష్యంగా చేసుకున్నారని ఆయన పేర్కొన్నారు. ఈసీలోని మిగతా ఇద్దరు కమిషనర్లు ఎస్ఐఆర్ ప్రక్రియలోని లోపాలను వ్యతిరేకించారని, దీనివల్ల జ్ఞానేశ్ కుమార్ ఏకపక్ష నిర్ణయాలు బయటపడ్డాయని రేవంత్ రెడ్డి తెలిపారు. అలాంటి అధికారిని తొలగించడానికి ప్రధాని నరేంద్ర మోదీకి అభ

లక్నపూర్ గ్రామంలో ఘనంగా దుర్గామాత ఉత్సవాలు





వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్):: మండల పరిధిలోని లక్నాపూర్ గ్రామంలో దుర్గా మాత నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రారంభం అయ్యాయి. దుర్గామాత అమ్మవారి ప్రతిష్టాపన కార్యక్రమం కొనసాగింది. ఉత్సవాలలో దుర్గామాత అమ్మవారి వద్ద అత్యంత భక్తి భావంతో భక్తులు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కుల మతాలకు అతీతంగా ఐక్యమత్యంగా గ్రామంలోని ప్రజలందరూ ఉత్సాహంగా దుర్గామాత ఉత్సవాలలో పాల్గొన్నారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం చోటుచేసుకుంది. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.సర్పంచ్ వెంకటమ్మ, సందీప్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, అయ్యప్ప రెడ్డి, కుర్వ సురేష్, చాకలి శ్రీనివాస్, అంజిలయ్య, అంజీలయ్య, తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని ఢిల్లీలో

-నిరసనలో పాల్గొన్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహిస్తున్న ఛలో ఢిల్లీ కార్యక్రమంలో ఢిల్లీలోని బరాఖంబ మెట్రో స్టేషన్ వద్ద తెలంగాణ కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి నిరసన తెలుపుతున్న పరిగి ఎమ్మెల్యే,టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందజేసిన

-మండల పార్టీ అధ్యక్షుడు జీ వెంకట రాములు

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): పరిగి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే ఆదేశాల మేరకు, సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారునికి అందజేసిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పరిగి మండల అధ్యక్షుడు వెంకట రాములు, మిట్ట కోడూరు గ్రామ అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్య ఖర్చుల భారం తగ్గించేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ వైద్య చికిత్సల కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద ప్రజలకు ఈ నిధి ఎంతో అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని, పేద ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వ సహాయం అందేలా పార్టీ నాయకులు కృషి చేస్తారని తెలిపారు. సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరుకు సహకరించిన ప్రభుత్వానికి, సంబంధిత ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, అనంతయ్యా , తదితరులు పాల్గొన్నారు.

కుల్కచర్లలో దుర్గాభవాని,

పోచమ్మ అమ్మవార్లను దర్శించుకున్న

- ఉమా రామ్మోహన్ రెడ్డి



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): కుల్కచర్ల మండల కేంద్రంలో దేవీ నవరాత్రుల సందర్భంగా ప్రతిష్టించిన దుర్గాభవాని అమ్మవారిని పరిగి ఎమ్మెల్యే, టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి సతీమణి ఉమా రామ్మోహన్ రెడ్డి భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు.ఈ సందర్భంగా అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు.అనంతరం కుల్కచర్ల మండల కేంద్రంలోని శ్రీ పోచమ్మ అమ్మవారి ఆలయాన్ని సందర్శించిన ఉమా రామ్మోహన్ రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.దేవీ నవరాత్రుల వేళ ఆలయాలకు వచ్చిన భక్తులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, అమ్మవారి అనుగ్రహం ప్రతి కుటుంబంపై ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మండల పిఎసిఎస్ చైర్మన్ భీమ్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, బ్లాక్ బి అధ్యక్షులు భరత్ కుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు గోపాల్ నాయక్, మాజీ ఎంపీటీసీ ఆనందం, కాంగ్రెస్ నాయకులు వెంకటయ్య గౌడ్, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌లో బాధితుల సమస్యలపై కలెక్టర్‌కు వినతులు

90 శాతం వైకల్యం ఉన్న వ్యక్తికి పింఛన్ పెంపు కోసం విజ్ఞప్తి ఇళ్ల స్థలాలు, భూ ఆక్రమణలు, పింఛన్లపై అర్జీలు 10 ఏళ్ల బాలిక వైద్య పరీక్షలకు ఆర్థిక సహాయం అందించిన కలెక్టర్





చిత్తూరు, అక్టోబర్ 12: (మహి న్యూస్): చిత్తూరు జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌కు పలువురు బాధితులు తమ సమస్యలపై వినతులు సమర్పించారు. అర్జీలను పరిశీలించిన కలెక్టర్ సంబంధిత అధికారులకు నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

1ల. 90 శాతం వైకల్యం ఉన్న వ్యక్తికి పింఛన్ పెంపు కోసం వినతి

పెద్దపంజాణి మండలం గుండ్లపల్లెకు చెందిన ఎన్. మార్కొండ తనకు 90 శాతం వైకల్యం ఉందని, ప్రస్తుతం అందుతున్న రూ.6 వేల పింఛన్ వైద్య ఖర్చులకు సరిపోవడం లేదని తెలిపారు. తనకు రూ.15 వేల పింఛన్ ఇప్పించి ఆదుకోవాలని కోరారు. దీనిపై సంబంధిత అధికారులు రికార్డులను పరిశీలించి నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

2ల. ప్రభుత్వ భూమి ఆక్రమణపై ఫిర్యాదు

రొంపిచెర్ల మండలం దిగువ ఊటుకూరివారిపల్లెకు చెందిన చెంచం రెడ్డి వెంకటరమణారెడ్డి, గ్రామ సమీపంలోని సర్వే నంబర్ 2171/2లో ఉన్న బాయికాడకుంటకు సంబంధించిన 3.95 సెంట్ల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని ఫిర్యాదు చేశారు. దీనిపై క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని తహసీల్దార్, సర్వేయర్‌ను కలెక్టర్ ఆదేశించారు.

3ల. ఇళ్ల స్థలాలు కేటాయించాలని గ్రామస్థుల వినతి

బంగారుపాళ్యం మండలం గూండ్లకట్టమంచి గ్రామానికి చెందిన ప్రజలు తమకు సొంత ఇళ్లు, ఇంటి స్థలాలు లేవని తెలిపారు. ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వ స్థలాలు కేటాయించి ఆదుకోవాలని కోరారు. దీనిపై సంబంధిత హౌసింగ్ అధికారులు, తహసీల్దార్ సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

4ల. అభయహస్తం పింఛన్ మంజూరు చేయాలని విజ్ఞప్తి

వేదురుకుప్పం మండలం కోనంగివారిపల్లెకు చెందిన పి. జానకమ్మ, అభయహస్తం పథకం కింద దరఖాస్తు చేసుకున్నప్పటికీ పింఛన్ మంజూరు కాలేదని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న తనకు పింఛన్ మంజూరు చేయాలని కోరారు. ఆమె అర్హతలను పరిశీలించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఏ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.





5ల. దివ్యాంగులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని వినతి

వి.కోట మండలానికి చెందిన దివ్యాంగ మిత్ర సేవా సంఘం సభ్యులు అర్హులైన దివ్యాంగులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరారు. గతంలో 31 మంది దివ్యాంగులకు ఇళ్ల స్థలాలు అవసరమని దరఖాస్తు చేయగా, 14 మందిని అర్హులుగా గుర్తించినట్లు తెలిపారు. అయినప్పటికీ ఇప్పటివరకు పట్టాలు మంజూరు కాలేదని పేర్కొన్నారు. దీనిపై క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలని వి.కోట తహసీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు.

6ల. పదేళ్ల బాలిక వైద్య పరీక్షలకు ఆర్థిక సహాయం

బంగారుపాళ్యం మండలం సంక్రాంతిపల్లికి చెందిన పదేళ్ల బాలిక శిల్ప వైద్య పరీక్షల కోసం ఆర్థిక సహాయం కోరింది. బాలిక పరిస్థితిని పరిశీలించిన జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పీజీఆర్ఎస్‌లోనే తక్షణ ఆర్థిక సహాయం అందించారు.

చిత్తూరు జిల్లాలో నేషనల్ మీడియేషన్ క్యాంపెయిన్ 3.0 విజయవంతానికి చర్యలు

పెండింగ్ కేసుల పరిష్కారానికి మధ్యవర్తిత్వం ఉత్తమ మార్గం 1,439 కేసులు గుర్తింపు.. 388 కేసులు మధ్యవర్తిత్వానికి రిఫర్ ప్రజలు మధ్యవర్తిత్వ అవకాశాన్ని వినియోగించుకోవాలి: సీనియర్ సివిల్ జడ్జి భారతి



చిత్తూరు, అక్టోబర్ 12: (మహి న్యూస్): చిత్తూరు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కేసులను పరస్పర అంగీకారంతో పరిష్కరించేందుకు నేషనల్ మీడియేషన్ క్యాంపెయిన్ 3.0 కింద విస్తృత చర్యలు చేపట్టినట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి భారతి తెలిపారు. సోమవారం మీడియా ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ప్రచార కార్యక్రమాల వివరాలను వెల్లడించారు.

1ల. 1,439 కేసులు గుర్తింపు

2026 ఆగస్టు 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు జిల్లాలో 1,439 కేసులను గుర్తించి, వాటిలో 388 కేసులను మధ్యవర్తిత్వానికి రిఫర్ చేసినట్లు భారతి తెలిపారు. ఈ ప్రచార కాలంలో కేసుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వివరించారు.

2ల. వివిధ రకాల కేసులకు అవకాశం

వైవాహిక, కుటుంబ, ఆస్తి వివాదాలు, చెక్ బౌన్స్ కేసులు, రుణ వసూళ్లు, వినియోగదారుల వివాదాలు, వాణిజ్య, కార్మిక వివాదాలు, రాజీకి వీలున్న క్రిమినల్ కేసులు తదితర అర్హమైన కేసులను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించేందుకు గుర్తించినట్లు తెలిపారు.

3ల. అవగాహన కార్యక్రమాలు

న్యాయాధికారుల కోసం ఏడు అవగాహన కార్యక్రమాలు, శిక్షణ పొందిన మధ్యవర్తుల కోసం 11 ఓరియంటేషన్ కార్యక్రమాలు నిర్వహించారు. బార్ అసోసియేషన్లతో 13 సమావేశాలు, మధ్యవర్తులు, ఇతర భాగస్వాములతో తొమ్మిది ర్యాలీలు నిర్వహించినట్లు చెప్పారు. ప్రజల్లో అవగాహన కోసం కరపత్రాలు, బ్రోచర్లు పంపిణీ చేసి, కోర్టు ప్రాంగణాల్లో బ్యానర్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

4ల. 70 నుంచి 75 మంది మధ్యవర్తులకు శిక్షణ

జిల్లాలో సుమారు 70 నుంచి 75 మంది మధ్యవర్తులకు కేసులను మధ్యవర్తిత్వానికి రిఫర్ చేయడం, వివాదంలో ఉన్న పక్షాలతో చర్చించడం, పరస్పర అంగీకారంతో పరిష్కారం సాధించడం వంటి అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు.

5ల. సామరస్యపూర్వక పరిష్కారానికి అవకాశం

మధ్యవర్తిత్వం ద్వారా ఇరుపక్షాలు స్వచ్ఛందంగా చర్చించుకుని వివాదాలను పరిష్కరించుకోవచ్చని భారతి పేర్కొన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కుటుంబ, ఆస్తి సంబంధిత వివాదాలకు ఇది ఉపయోగకరమని తెలిపారు. చట్టపరంగా అర్హమైన కేసుల్లో సంబంధిత పక్షాలు ఆసక్తి చూపితే న్యాయస్థానం ద్వారా మధ్యవర్తిత్వానికి రిఫర్ చేయించుకోవచ్చని సూచించారు. ప్రజలు తమ వివాదాలను దీర్ఘకాలం కోర్టుల్లో కొనసాగించకుండా, మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కారం పొందేందుకు ముందుకు రావాలని భారతి కోరారు. మరిన్ని వివరాల కోసం జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు.

పీ4 విధానంలో బీసీ యువతకు ఉచిత సివిల్స్ శిక్షణ

ఏటా 100 మందికి శిక్షణతో పాటు ఉచిత వసతి, అధ్యయన సామగ్రిలి

డీఎస్సీ, గ్రూప్--1, పోలీసు ఉద్యోగాలకూ ఉచిత శిక్షణ

డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ అకాడమీతో బీసీ సంక్షేమ శాఖ ఒప్పందం

సివిల్స్ మెయిన్స్‌కు ఎంపికైన బీసీ అభ్యర్థులకు రూ.2 లక్షల ఆర్థిక సాయం

అమరావతి, మహి న్యూస్ అక్టోబర్ 12: బీసీ నిరుద్యోగ యువత సివిల్ సర్వీసెస్‌లో ఉన్నత స్థానాలను సాధించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పీ4 విధానంలో ఉచిత సివిల్స్ శిక్షణ అందించేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ అకాడమీతో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ఒప్పందం కుదుర్చుకుంది. రాష్ట్ర సచివాలయంలో మంత్రి సవిత సమక్షంలో అకాడమీ ప్రతినిధులు, బీసీ సంక్షేమ శాఖ అధికారులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, బీసీ యువత అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించి ఉన్నత స్థానాల్లో స్థిరపడాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని తెలిపారు. ఈ దిశగా బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా సివిల్స్, గ్రూప్--1, డీఎస్సీ, పోలీసు ఉద్యోగాల వంటి పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. పీ4 విధానంలో సివిల్స్ శిక్షణ అందించేందుకు డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ అకాడమీ ముందుకు రావడం సంతోషకరమని మంత్రి అన్నారు. అభ్యర్థులకు నిపుణులైన అధ్యాపకులతో బోధన అందించడంతో పాటు అవసరమైన అధ్యయన సామగ్రిని ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.



త్వరలో డీఎస్సీ ఉచిత శిక్షణ

2014--19 మధ్య బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా ఉచిత సివిల్స్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు మంత్రి గుర్తుచేశారు. అనంతరం నిలిచిపోయిన ఈ కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పునరుద్ధరించినట్లు తెలిపారు. గత రెండేళ్లలో 200 మందికి ఉచిత సివిల్స్ శిక్షణ అందించామని, 2025 మెగా డీఎస్సీతో పాటు గ్రూప్--1 పరీక్షలకు కూడా శిక్షణ ఇచ్చామని వివరించారు. ప్రభుత్వం నిర్వహించే అర్హత పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన 100 మంది అభ్యర్థులకు ఉచిత వసతితో కూడిన సివిల్స్ శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలైన వెంటనే ఉచిత శిక్షణ ప్రారంభిస్తామని, బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విధానాల్లో శిక్షణ అందిస్తామని పేర్కొన్నారు. ఎస్ఐ, పోలీసు కానిస్టేబుల్ తదితర పోటీ పరీక్షలకు కూడా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు.

మెయిన్స్‌కు ఎంపికైన వారికి రూ.2 లక్షల సాయంలి

ఈ కార్యక్రమంలో పాల్గొన్న పీ4 ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు కుటుంబరావు మాట్లాడుతూ, సివిల్స్ మెయిన్స్‌కు ఎంపికైన బీసీ అభ్యర్థులకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున వ్యక్తిగత ఆర్థిక సాయం అందించనున్నట్లు ప్రకటించారు. పార్ట్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు భాగవతుల రవికుమార్ మాట్లాడుతూ, బీసీ విద్యార్థులకు సివిల్స్ శిక్షణ అందించడం ఆనందంగా ఉందన్నారు. డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ అకాడమీ ప్రధాన మార్గదర్శి లక్ష్మయ్య మాట్లాడుతూ, ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ తీసుకుని మెరుగైన శిక్షణ అందిస్తామని తెలిపారు. ఏపీ గెజిటెడ్ జేఏసీ చైర్మన్ కేవీ కృష్ణయ్య తమ ఉద్యోగ సంఘం తరపున కూడా పలువురు విద్యార్థులకు పీ4 విధానంలో శిక్షణ అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణతో పాటు పలువురు అధికారులు, అకాడమీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టం కింద నిర్ణీత గడువులో సమాచారం అందించాలి

అర్జీదారులకు సకాలంలో సమాచారం ఇవ్వాలి

కార్యాలయాల్లో పీఐఓ, ఏపీఐఓల వివరాలతో నోటీసు బోర్డులు ఏర్పాటు చేయాలి

సెక్షన్ 4(1)(బి) వివరాలను తప్పనిసరిగా నవీకరించాలి



అనంతపురం, అక్టోబర్ 12: (మహి న్యూస్): సమాచార హక్కు చట్టం కింద అర్జీదారులకు నిర్ణీత గడువులో సమాచారం అందించాలని డీఆర్వో ఏ. మలోల సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో ఆర్టీఐ వారోత్సవాల్లో భాగంగా వివిధ శాఖల హెచ్ఓడీలు, ప్రజా సమాచార అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టం కింద వివిధ శాఖల పీఐఓలు, ఏపీఐఓల వివరాలను ఆయా కార్యాలయాల్లోని నోటీసు బోర్డులపై ప్రదర్శించాలని సూచించారు. సెక్షన్ 4(1)(బి)కు సంబంధించిన వివరాలను తప్పనిసరిగా నవీకరించుకోవాలని, సమాచార హక్కు చట్టంపై అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, రామ్మోహన్, కలెక్టరేట్ పీఐఓ అలెగ్జాండర్, సూపరింటెండెంట్లు వసంతలత, రియాజుద్దీన్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్

వివిధ సమస్యలపై అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించిన జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్

కార్యక్రమంలో పాల్గొన్న జాయింట్ కలెక్టర్, డీఆర్వో, వివిధ శాఖల అధికారులు



అనంతపురం, అక్టోబర్ 12: (మహి న్యూస్): అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ మండలాల నుంచి తమ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన అర్జీదారుల నుంచి జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్, డీఆర్వో ఏ. మలోల, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, రామ్మోహన్, వెంకట నారాయణ, రమేష్ రెడ్డి, కిరణ్మయి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.





బుక్కరాయసముద్రం చెరువులో 1.47 లక్షల చేప పిల్లల విడుదల

ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద రెండో విడతలో చేప పిల్లల విడుదల

మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వ పథకాలు దోహదం

కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



సింగనమల, అక్టోబర్ 12: (మహి న్యూస్) : అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం చెరువులో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) కేంద్ర పథకం కింద రెండో విడతగా 1,47,000 చేప పిల్లలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, సింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, అసిస్టెంట్ కలెక్టర్ సుయశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధి, జీవనోపాధికి భరోసా కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన ద్వారా చేపల పెంపకాన్ని ప్రోత్సహిస్తూ అర్హులైన మత్స్యకారులకు సబ్సిడీపై సహాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆదరణ-3 పథకం ద్వారా వలలు, పడవలు వంటి అవసరమైన పనిముట్లను అందించి మత్స్యకారుల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు రూ.20 వేల ఆర్థిక సహాయం అందించడంతో పాటు సముద్ర మత్స్యకారులకు డీజిల్, పెట్రోల్ రాయితీలు కల్పిస్తున్నట్లు వివరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సహకారంతో గ్రామీణాభివృద్ధి, మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని పేర్కొన్నారు. మత్స్యకారుల అభ్యున్నతికి అవసరమైన ప్రభుత్వ సహాయ సహకారాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బెస్త సంఘం ప్రతినిధులు, మత్స్యకారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జాతీయ స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన (పి.డి) వై. శ్రీనివాసరావు





మహి న్యూస్ కొత్తపేట అక్టోబర్ 12 : మాస్టర్ అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారు గుంటూరు నాగార్జున యూనివర్సిటీ లో ఈ నెల 10,11వ తేదీ లలో నిర్వహించిన రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా నుండి కొత్తపేట మండలం, ఆవిడి గ్రామం చప్పిడివారిపాలెం హైస్కూల్ లో వ్యాయామ ఉపాధ్యాయులు గా పనిచేస్తున్న వై.శ్రీనివాసరావు (వైస్ఆర్) పాల్గొని షాట్ పుట్ విభాగంలో ఫస్ట్ ప్లేస్, డిస్కస్ త్రో విభాగంలో సెకండ్ ప్లేస్, ప్లేస్, ట్రిపుల్ జంప్ విభాగంలో సెకండ్ ప్లేస్ సాధించి జనవరి 2027 ఉత్తరప్రదేశ్ లక్నో లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారు ఈ సందర్భంగా పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు గ్రామ పెద్దలు వై. శ్రీనివాసరావును ను అభినందించారు.

దసరా నవరాత్రుల సందర్భంగా దేవాలయాల్లో పటిష్ట భద్రతా చర్యలు

భక్తులకు తాగునీరు, మరుగుదొడ్లు, మెరుగైన లైటింగ్ సౌకర్యాలు కల్పించాలి

క్యూలైన్లు, బ్యారికేడ్లు, సీసీటీవీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ

ప్రధాన దేవాలయాల్లో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి



అనంతపురం, అక్టోబర్ 12: (మహి న్యూస్): దసరా పండుగ, నవరాత్రుల సందర్భంగా దేవాలయాలకు వచ్చే భక్తుల భద్రత, సౌకర్యాల కోసం పటిష్టమైన చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో జిల్లా భక్తుల భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, దేవాలయాల్లో పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలని, నిఘా కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా పటిష్టమైన క్యూలైన్లు, అవసరమైన చోట బ్యారికేడ్లు ఏర్పాటు చేయాలని, మెరుగైన లైటింగ్, తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. జిల్లాలో సుమారు 2,600 దేవాలయాలు ఉండగా, నవరాత్రుల సందర్భంగా ప్రధానంగా 10 దేవాలయాలకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. శ్రీ కాశీ విశ్వేశ్వర కోదండరామస్వామి దేవాలయం, శ్రీ చింతల వెంకటరమణ స్వామి దేవాలయం, శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి దేవాలయం, కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవాలయం, గవిమఠం, పెన్నహోబిలం శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం తదితర ఆలయాల్లో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణ కోసం దేవాలయాల కార్యనిర్వహణాధికారులు సంబంధిత పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. ముఖ్యమైన రోజుల్లో 24 గంటల విద్యుత్ సరఫరా, సీసీటీవీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ, అగ్నిమాపక భద్రత, మరుగుదొడ్ల నిరంతర శుభ్రత, నాణ్యమైన ప్రసాదం పంపిణీ వంటి ఏర్పాట్లు చేయాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అంతకుముందు కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవాలయ వేదపండితులు, అర్చకులు జాయింట్ కలెక్టర్‌కు వేదాశీర్వచనం అందించారు. ఈ సమావేశంలో ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ సుధారాణి, డీఎండబ్ల్యూఓ రామసుబ్బారెడ్డి, కసాపురం ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు, పెన్నహోబిలం ఈవో రమేష్ బాబు, ఈవోలు అక్కిరెడ్డి, నాగేంద్రుడు, ఎండోమెంట్ టౌన్ ఇన్‌స్పెక్టర్ వన్నూరుస్వామి తదితరులు పాల్గొన్నారు.

అనంత మదర్స్ మిల్క్ బ్యాంక్‌కు జాతీయ స్థాయి గుర్తింపు

నేషనల్ చేంజ్ మేకర్ అవార్డుకు ఎంపికైన డాక్టర్ గుజ్జుల హేమలత

తల్లిపాలు లేని శిశువులకు ఉచితంగా పాలు అందించడం దైవకార్యం

మిల్క్ బ్యాంక్ సిబ్బందిని అభినందించిన కలెక్టర్ ఓ. ఆనంద్



అనంతపురం, అక్టోబర్ 12: (మహి న్యూస్): అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో నిర్వహిస్తున్న అనంత మదర్స్ మిల్క్ బ్యాంక్‌కు జాతీయ స్థాయి గుర్తింపు లభించడం గర్వకారణమని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ పేర్కొన్నారు. మిల్క్ బ్యాంక్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి, అనంతపురం జీజీహెచ్ డిప్యూటీ ఆర్ఎంఓ, డాక్టర్ గుజ్జుల హేమలత నేషనల్ చేంజ్ మేకర్ అవార్డుకు ఎంపిక కావడం జిల్లాకు గౌరవమని తెలిపారు. గుజరాత్‌లోని స్టాట్యూ ఆఫ్ యూనిటీతో అనుసంధానమై పనిచేస్తున్న సమన్వై ప్రతిష్ఠాన్ వడోదర స్వచ్ఛంద సంస్థ వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన 51 మందికి నేషనల్ చేంజ్ మేకర్ అవార్డులను ప్రదానం చేసింది. ఈ అవార్డులను సంస్థ ప్రతినిధి డాక్టర్ అజయ్ రాంకా ఇటీవల అందజేశారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఈ అవార్డుకు డాక్టర్ గుజ్జుల హేమలత ఎంపికయ్యారు.




సోమవారం అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం డాక్టర్ హేమలత తన బృందంతో కలిసి కలెక్టర్ ఓ. ఆనంద్‌ను కలసి అవార్డును చూపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారిని అభినందించారు. తల్లిపాలు అందక ఇబ్బందులు ఎదుర్కొనే శిశువులకు మిల్క్ బ్యాంక్ ద్వారా ఉచితంగా పాలు అందించడం గొప్ప సేవ అని కలెక్టర్ పేర్కొన్నారు. తల్లి తన బిడ్డకు అవసరమైన పాలు ఇచ్చిన తర్వాత మిగిలిన పాలను సేకరించి, శాస్త్రీయంగా భద్రపరిచి తల్లిపాలు అందుబాటులో లేని చిన్నారులకు అందించడం ద్వారా వారి ప్రాణాలను కాపాడుతున్నారని కొనియాడారు. స్వచ్ఛందంగా పాలు అందిస్తున్న తల్లులకు కృతజ్ఞతలు తెలిపారు. మిల్క్ బ్యాంక్ ప్రారంభమైన కొద్ది కాలంలోనే జాతీయ స్థాయి అవార్డు రావడం వెనుక సిబ్బంది చిత్తశుద్ధి, అంకితభావం, నిస్వార్థ సేవ ఉన్నాయని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో సేవలను కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పీడియాట్రిక్ వైద్యులు డాక్టర్ హరిణి, డాక్టర్ రాధిక, డాక్టర్ ప్రవీణ్, స్టాఫ్ నర్సులు సునీత, మానస, బోయ సుకన్య, హైమావతి, రమాదేవి, సిబ్బంది రాధ, పల్లవి, నాగమణి, సాయికుమార్, వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగ్ పద్ధతిలో పంటల సాగు చేపట్టాలి

ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులకు అవగాహన కల్పించాలి ఖరీఫ్ ఈ-పంట నమోదు, ఈ-కేవైసీ ప్రక్రియ వేగవంతం చేయాలి జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్




అనంతపురం, అక్టోబర్ 12: (మహి న్యూస్): ఎల్‌నినో ప్రభావంతో ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున వ్యవసాయ, ఉద్యాన పంటలను ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగ్ (పీఎండీఎస్) పద్ధతిలో సాగు చేస్తూ, ఏపీసీఎన్ఎఫ్ విధానాలను అనుసరించాలని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు అంశాలపై సమీక్షించారు. ప్రతి గ్రామంలో పీఎండీఎస్ పద్ధతిలో పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని, గ్రామ వ్యవసాయ సహాయకులు, ఉద్యాన సహాయకులు, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది సాంకేతిక సలహాలు అందించాలని కలెక్టర్ సూచించారు. ఉద్యాన పంటల ప్లాంటేషన్లలో ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులకు అవగాహన కల్పించాలి ఖరీఫ్ ఈ-పంట నమోదు, ఈ-కేవైసీ ప్రక్రియ వేగవంతం చేయాలి జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు అంశాలపై సమీక్షించారు. ప్రతి గ్రామంలో పీఎండీఎస్ పద్ధతిలో పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని, గ్రామ వ్యవసాయ సహాయకులు, ఉద్యాన సహాయకులు, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది సాంకేతిక సలహాలు అందించాలని కలెక్టర్ సూచించారు. ఉద్యాన పంటల ప్లాంటేషన్లలో ఈ విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని, డ్వామా కింద కొత్తగా చేపట్టే తోటల్లో ఒకే పంటకు బదులుగా మిశ్రమ పంటల సాగును ప్రోత్సహించాలని తెలిపారు. డీఆర్‌డీఏ, ఏపీసీఎన్ఎఫ్ సమన్వయంతో మహిళా సమాఖ్యలు, గ్రామ సమాఖ్యల ద్వారా రైతుల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఖరీఫ్ 2026 ఈ-పంట నమోదులో ఇప్పటివరకు 10.8 శాతం మాత్రమే పూర్తయిందని, మూడు, నాలుగు రోజుల్లో ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సచివాలయ సిబ్బంది సేవలను వినియోగించుకుని, వ్యవసాయ శాఖ అధికారులు ప్రతిరోజూ పురోగతిని సమీక్షించాలని ఆదేశించారు. పల్లె పండుగ 3.0 కింద మంజూరైన 1,326 సీసీ రోడ్డు పనుల్లో 1,030 పనులు ప్రారంభమయ్యాయని, మిగిలిన పనులను వెంటనే ప్రారంభించాలని తెలిపారు. మంజూరైన 39 బీటీ రోడ్డు పనుల్లో 33 పురోగతిలో ఉన్నాయని, వాటిని త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అలాగే గ్రావెల్ రోడ్డు పనులను వేగవంతం చేయాలని, జలధార, జలహారతి ఫేజ్-2 పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. నవంబర్‌లో 49 గ్రామాల్లో పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీకి అవసరమైన చర్యలు తీసుకోవాలని, ఈ-కేవైసీ పూర్తి చేసి పాసుపుస్తకాలు సిద్ధం చేయాలని తెలిపారు. జల్ జీవన్ మిషన్ కింద మంజూరైన 627 పనుల్లో 426 పూర్తయ్యాయని, మిగిలిన పనులను వేగవంతం చేయాలని సూచించారు. అక్షరాంధ్ర కార్యక్రమంలో నమోదైన 1,37,248 మంది ప్రతిరోజూ హాజరు నమోదు చేసేలా ఎంపీడీవోలు పర్యవేక్షించాలని ఆదేశించారు. సమావేశంలో డ్వామా పీడీ సలీమ్ భాష, జిల్లా వ్యవసాయ అధికారి సాలురెడ్డి, పశుసంవర్ధక శాఖ జేడీ ప్రేమ్‌చంద్, ఉద్యాన శాఖ డీడీ ధనుంజయ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కె. శ్రీనివాసులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



యానంలో ట్రేడ్ లైసెన్సులు లేకుండానే దీపావళి షాపులు!

అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం.. ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది?

యానం, మహి న్యూస్, అక్టోబర్ 12: కేంద్రపాలిత ప్రాంతమైన యానంలో పుదుచ్చేరి మున్సిపల్ యాక్ట్ 1973, ఎక్స్ ప్లోసివ్ రూల్స్ 2008 మరియు ఎక్సప్లోసివ్ 1884 ను ఉల్లంఘిస్తూ 14 పర్మినెంట్ బాణాసంచా దుకాణాలు మున్సిపల్ ట్రేడ్ లైసెన్సులు లేకుండానే విచ్చలవిడిగా బాణాసంచా వ్యాపారాలు నిర్వహిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2026 సంవత్సరానికి సంబంధించి ట్రేడ్ లైసెన్సులు రెన్యువల్ చేయించుకోకుండానే కొందరు వ్యాపారులు దుకాణాలు నిర్వహిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారుల తీరుపై పలువురు బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. సాధారణంగా వ్యాపార లైసెన్సుల గడువు ముగిసిన అనంతరం నిబంధనల ప్రకారం వాటిని రెన్యువల్ చేయించుకోవాల్సి ఉంటుంది. అయితే, ఈ విషయంలో అధికారులు తగిన చర్యలు తీసుకోకపోవడంతో వ్యాపారులు యథేచ్ఛగా దుకాణాలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా దీపావళి పండుగ నేపథ్యంలో బాణసంచా దుకాణాల నిర్వహణలో నిబంధనలు పాటిస్తున్నారా? అవసరమైన అనుమతులు తీసుకున్నారా? అనే అంశాలపై అధికారులు తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది?

దుకాణాలలో 100 కిలోలు మించి బాణసంచా సామాగ్రి ఉండకూడదని నిబంధనలు ఎప్పుడో గాలికి వదిలేసారు.

దీపావళి సమయంలో బాణసంచా విక్రయాలు, నిల్వల విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనుమతులు, భద్రతా ప్రమాణాల అమలుపై ముందస్తు చర్యలు తీసుకోకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే, ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి యానంలోని దీపావళి దుకాణాలను తనిఖీ చేయాలని, ట్రేడ్ లైసెన్సులు, అవసరమైన ఇతర అనుమతులు పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాలు నిర్వహిస్తున్నట్లు తేలితే తగిన చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రజల భద్రతకు ప్రాధాన్యమివ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



అర్జీదారుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలి

ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించాలి

నిర్ణీత గడువులో పారదర్శకంగా పరిష్కారం చూపాలి

పరిష్కారం సాధ్యం కాని అంశాలకు స్పష్టమైన కారణాలు తెలియజేయాలి





గుంటూరు, అక్టోబర్ 12: (మహా న్యూస్): ప్రజా సమస్యల పరిష్కారానికి వచ్చే అర్జీదారుల పట్ల అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ ఆదేశించారు. సోమవారం గుంటూరు కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, డిప్యూటీ కలెక్టర్ గంగరాజు, డ్వామా పీడీ శంకర్ తదితరులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అర్జీదారుల విజ్ఞప్తులపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా విచారణ నిర్వహించి, పారదర్శకంగా పరిష్కారం చూపాలని సూచించారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోగా సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తూ, ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన సేవలు అందించాలని స్పష్టం చేశారు. పరిష్కారం సాధ్యంకాని అర్జీల విషయంలో అందుకు గల స్పష్టమైన కారణాలను అర్జీదారులకు తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం లేకుండా బాధ్యతతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఈ నెల 16న సీఐఐ ప్రాంతీయ సదస్సు

ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో సదస్సు నిర్వహణ

అతిథులకు అవసరమైన ఏర్పాట్లు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి

పలువురు మంత్రులు, ఉన్నతాధికారులు హాజరు



గుంటూరు, అక్టోబర్ 12: (మహా న్యూస్): సీఐఐ ప్రాంతీయ సదస్సు ఈ నెల 16న నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో సదస్సు ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. సదస్సు ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో జరగనున్న నేపథ్యంలో అతిథులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సదస్సుకు హాజరయ్యే అతిథుల కోసం వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు. పాల్గొనే అతిథుల వివరాలను ముందుగానే సేకరించాలని పరిశ్రమల శాఖ అధికారులను ఆదేశించారు. ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ సదస్సుకు కేంద్ర కమ్యూనికేషన్లు, గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌తో పాటు పలువురు మంత్రులు, ఉన్నతాధికారులు హాజరుకానున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, తెనాలి రెవెన్యూ డివిజనల్ అధికారి కె. శ్రీరమణి, ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి సూపరింటెండెంట్ దుర్గా ప్రసాద్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి మక్కెన పద్మావతి, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె. కళ్యాణ చక్రవర్తి, విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజనీర్ సి.హెచ్. రమేష్, జిల్లా పౌర సరఫరాల అధికారి పి. కోమలి పద్మ, సర్వే శాఖ సహాయ సంచాలకులు ఎస్. వెంకటరావు, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి. విజయలక్ష్మి, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవంపై అవగాహన పెంచాలి

విద్యార్థుల్లో మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించాలి

మానసిక సమస్యల ప్రారంభ లక్షణాలను గుర్తించి సకాలంలో వైద్య సహాయం పొందాలి

టెలీ-మానస్ సేవలపై విస్తృత ప్రచారం నిర్వహించాలి



పల్నాడు జిల్లా, అక్టోబర్ 12: (మహా న్యూస్): ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజల్లో, ముఖ్యంగా విద్యార్థుల్లో మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంపొందించేందుకు విస్తృతంగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా ఐఏఎస్ సూచించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవానికి సంబంధించిన అవగాహన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. మానసిక ఆరోగ్యం ప్రాముఖ్యత, మానసిక సమస్యల ప్రారంభ లక్షణాలను గుర్తించడం, అవసరమైన సమయంలో వైద్య సహాయం పొందడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలల్లో టెలీ-మానస్ సేవల గురించి విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. మానసిక సమస్యలతో బాధపడుతున్నవారు సకాలంలో సహాయం పొందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రత్న మనోహన్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

అర్జీదారుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలి

వృద్ధులు, దివ్యాంగుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలి


మొత్తం 112 అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా

పెండింగ్ అర్జీలు, రీ-ఓపెనింగ్‌కు అవకాశం లేకుండా నాణ్యమైన పరిష్కారాలు చూపాలి

ప్రభుత్వ కార్యాలయాల్లో సిటిజన్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్ తప్పనిసరిగా ప్రదర్శించాలి



నరసరావుపేట, అక్టోబర్ 12: (మహా న్యూస్): జిల్లాలోని సుదూర ప్రాంతాల నుంచి సమస్య పరిష్కారం కోసం వచ్చే అర్జీదారుల పట్ల అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా ఆదేశించారు. సోమవారం నరసరావుపేట కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) హాలులో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా, డీఆర్వో అద్దయ్య మొత్తం 112 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఫిర్యాదులపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా విచారణ నిర్వహించి, పారదర్శకంగా సమస్యలను పరిష్కరించాలని సూచించారు. నిర్ణీత గడువులోగా అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలన్నారు. గడువు దాటిన పెండింగ్ అర్జీలు, తిరిగి తెరిచే పరిస్థితులు లేకుండా నాణ్యమైన పరిష్కారాలు అందించాలని ఆదేశించారు. వృద్ధులు, దివ్యాంగుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, మానవతా దృక్పథంతో సత్వర చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన సిటిజన్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్‌ను అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజా ఫిర్యాదుల పరిష్కార కేంద్రాలు, పౌర సేవా కేంద్రాల్లో తప్పనిసరిగా ప్రదర్శించాలని తెలిపారు. ఫిర్యాదుదారులు క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ సమస్యల పరిష్కారంపై అభిప్రాయాలను తెలియజేసేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రజల నుంచి అందే అభిప్రాయాలను ఎప్పటికప్పుడు పరిశీలించి, సేవల నాణ్యతను మెరుగుపరిచే చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన సేవలు అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.




అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా షార్ట్ ఫిల్మ్ విజేతలకు నగదు బహుమతులు

లింగ వివక్ష నిర్మూలన, బాలికల హక్కుల పరిరక్షణపై షార్ట్ ఫిల్మ్ పోటీలు

మొదటి బహుమతి రూ.30 వేలు, రెండో బహుమతి రూ.20 వేలు, మూడో బహుమతి రూ.10 వేలు

విజేతలకు బహుమతులు అందజేసిన జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా



నరసరావుపేట, అక్టోబర్ 12: (మహా న్యూస్): అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి షార్ట్ ఫిల్మ్ పోటీల విజేతలకు జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ కృతికా శుక్లా నగదు బహుమతుల చెక్కులు, ప్రతిభా పురస్కార పత్రాలను అందజేశారు. “లింగ నిర్ధారణను అరికడదాం -- ఆడపిల్లను కాపాడుదాం” అనే అంశంపై ఈ పోటీలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు చెందిన ఎనిమిది బృందాలు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. విద్యార్థులు రూపొందించిన లఘు చిత్రాల ద్వారా లింగ వివక్ష నిర్మూలన, లింగ సమానత్వం, బాలికల హక్కుల పరిరక్షణ, భ్రూణ లింగ నిర్ధారణ నిషేధంపై ప్రజల్లో అవగాహన కల్పించే ప్రయత్నం చేశారు. పోటీల్లో మొదటి బహుమతిగా రూ.30 వేలు, రెండో బహుమతిగా రూ.20 వేలు, మూడో బహుమతిగా రూ.10 వేల నగదు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతిని వినుకొండలోని ఎస్‌జీకే ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన మన్నెం రవి తేజ, అతని బృందం గెలుచుకున్నారు. రెండో బహుమతిని నాగార్జునసాగర్‌లోని ఏపీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన సంబంగి జయంత్ కుమార్, అతని బృందం సాధించారు. మూడో బహుమతిని వినుకొండ ఎస్‌జీకే ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన యు. అజయ్ కుమార్, అతని బృందం దక్కించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ చుక్కా రత్న మనోహన్ మాట్లాడుతూ, బాలికలపై వివక్షను నిర్మూలించడం, వారి హక్కులను పరిరక్షించడం, సమాజంలో లింగ సమానత్వాన్ని పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపొందించడంతో పాటు, సృజనాత్మక మాధ్యమాల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఇటువంటి పోటీలు దోహదపడతాయని పేర్కొన్నారు. భ్రూణ లింగ నిర్ధారణను అరికట్టడం, బాలికలకు సమాన అవకాశాలు కల్పించడం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అధికారులు సూచించారు. భ్రూణ లింగ నిర్ధారణ నిషేధ చట్టం--1994 (పీసీపీఎన్‌డీటీ) నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్, ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త, ఐసీడీఎస్ పీడీ, ఎన్‌సీడీ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రాజేశ్వరి, డిప్యూటీ డిస్ట్రిక్ట్ ఎక్స్‌టెన్షన్ అండ్ మీడియా ఆఫీసర్ షేక్ ఖాజావలి, హెల్త్ ఎడ్యుకేటర్ అనంత కుమారి తదితరులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న వినుకొండ,



నాగార్జునసాగర్, మాచర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, విద్యార్థులకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ చుక్కా రత్న మనోహన్ కృతజ్ఞతలు తెలిపారు.

దివ్యాంగురాలికి వెంటనే ట్రై సైకిల్ అందజేసిన కలెక్టర్ కృతిక శుక్ల

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీ సమర్పించిన నాజిని

అర్జీపై స్పందించి తక్షణమే ట్రై సైకిల్ అందజేత



నరసరావుపేట, అక్టోబర్ 12: (మహా న్యూస్): దివ్యాంగుల సమస్యల పట్ల స్పందించిన పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల, నకరికల్లు మండలానికి చెందిన దివ్యాంగురాలు నాజినికి వెంటనే ట్రై సైకిల్ అందజేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నాజిని తనకు ట్రై సైకిల్ మంజూరు చేయాలని కోరుతూ కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు. అర్జీని స్వయంగా స్వీకరించిన కలెక్టర్, సమస్యపై వెంటనే స్పందించి ట్రై సైకిల్‌ను నాజినికి అందజేశారు.

జాతీయ స్థాయి యోగాసన పోటీలకు ఏపీ గురుకుల పాఠశాల విద్యార్థులు

రాష్ట్రస్థాయి యోగాసన ఛాంపియన్‌షిప్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన పదో తరగతి విద్యార్థులు షేక్ జి. అబ్దుల్ ముబారక్, కే. రవీంద్రనాథ్ ఠాగూర్ చక్రవర్తి

విద్యార్థులను అభినందించిన ప్రిన్సిపాల్ ఎం. రజని, ఉపాధ్యాయ సిబ్బంది



గుంటూరు, అక్టోబర్ 12: (మహా న్యూస్):గుంటూరులోని నందివెలుగు రోడ్డులో ఉన్న ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి యోగాసన పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 10, 11 తేదీల్లో నెల్లూరు జిల్లా కావలిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యోగ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగాసన ఛాంపియన్‌షిప్-2026 రాష్ట్రస్థాయి పోటీల్లో పదో తరగతికి చెందిన షేక్ జి. అబ్దుల్ ముబారక్, కే. రవీంద్రనాథ్ ఠాగూర్ చక్రవర్తి ఉత్తమ ప్రతిభ కనబరిచారు. వీరు డిసెంబర్ 26, 27, 28 తేదీల్లో జార్ఖండ్ రాష్ట్రం ధన్‌బాద్ నగరంలో ఇండియన్ యోగ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న యోగాసన ఛాంపియన్‌షిప్-2026 జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన పీఈటీ ఆర్. శ్రీనివాసులును, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ ఎం. రజని, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

పల్నాడు జిల్లా ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే జూలకంటి..!



మాచర్ల అక్టోబర్ 12: (మహా న్యూస్): పల్నాడు జిల్లా ఎస్పీ జగదీష్ అదహల్లీ ను ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎమ్మెల్యే పుష్పగుచ్ఛం అందజేసి, జగదీష్ కు అభినందనలు తెలిపారు. తాజా పరిణామాలు, పలు అంశాలపై కొంత సమయం చర్చించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా ను కలిసిన ఆయన, వరికపూడిశెల ప్రాజెక్ట్ నిర్మాణానికి జరుగుతున్న భూసేకరణ, అడ్డంకులు వంటి వాటిపై చర్చించారు. అలానే జల్ జీవన్ మిషన్ నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో శరవేగంగా నిర్మిస్తున్న పల్నాడు వాటర్ గ్రిడ్ పనులపై సమీక్షించారు.

రైతు నేస్తం క్లస్టర్ హైరింగ్ సెంటర్లు..!

ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



వెల్దుర్తి అక్టోబర్ 12: (మహా న్యూస్): రైతుల పాలిట నేస్తం క్లస్టర్ హైరింగ్ సెంటర్లు అని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చెప్పారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో డీఆర్డీఏ వారి అయిన ఫార్మర్ ప్రొడ్యూసింగ్ ఆర్గనైజింగ్ ప్రాజెక్ట్ ద్వారా రైతుల కోసం అందుబాటులో తీసుకొచ్చిన సీ.ఎహెచ్.సీ కు సంబంధించిన నూతన ట్రాక్టర్, ఇతర వ్యవసాయ పనిముట్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.., తక్కువ మొత్తంలో పరికరాలను అద్దెకు ఇచ్చి.., చిన్న, సన్నకారు రైతులకు



వెన్నుదన్నుగా జనజ సెంటర్లు నిలుస్తున్నాయన్నారు. ఈ సెంటర్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రస్తుత రోజుల్లో వ్యవసాయం మొత్తం యాంత్రీకరణ వైపు పరివర్తనం చెంది, కౌలు రైతులకు భారంగా మారిందని.., ట్రాక్టర్, ట్రక్కు రోటవేటర్, పవర్ వేటర్ వంటివి పలు వ్యవసాయ పనిముట్లు రైతులకు తక్కువ ధరకు అద్దెకు ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం రంగారెడ్డి, ఎఫ్.పీ.వో సిసి గురవయ్య, సీసీ లాలు, ఎంఎస్ ప్రెసిడెంట్ అనుషా, వీవోపీలు, రైతు మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు పటిష్టమైన ముందస్తు ఏర్పాట్లు చేయాలి

సమస్యాత్మక గ్రామాలు, వార్డులను గుర్తించాలి ఎన్నికల విధులపై శాఖల మధ్య సమన్వయం అవసరం జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ



గుంటూరు, అక్టోబర్ 12: (మహా న్యూస్): జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలను స్వేచ్ఛగా, పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్టమైన ముందస్తు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి




జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో ఎన్నికల సన్నద్ధతపై సమీక్ష నిర్వహించారు. మండల, డివిజన్, జిల్లా స్థాయిల్లో పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో సమన్వయ బృందాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. సమస్యాత్మక గ్రామాలు, వార్డులను క్షేత్రస్థాయిలో పరిశీలించి గుర్తించి మంగళవారం నాటికి వివరాలు అందించాలన్నారు. సాధారణ, సున్నిత, అతి సున్నిత పోలింగ్ కేంద్రాల జాబితాలను మరోసారి పరిశీలించి, శాంతిభద్రతల పరిరక్షణకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉన్నందున అధికారులు ముందుగానే సన్నద్ధం కావాలని, ఎన్నికల షెడ్యూల్ విడుదలైన వెంటనే ప్రవర్తనా నియమావళి అమల్లోకి వస్తుందని తెలిపారు. ఎన్నికల ప్రచార సమావేశాలు, ర్యాలీలు, లౌడ్‌స్పీకర్ల వినియోగానికి అనుమతులు ఇచ్చేందుకు సింగిల్ విండో విధానం అమలు చేయాలని సూచించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ గత అనుభవాలు, క్షేత్రస్థాయి పరిస్థితుల ఆధారంగా సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించాలని తెలిపారు. బైండ్ ఓవర్ కేసులపై వెంటనే చర్యలు తీసుకోవాలని, అవసరమైన ప్రాంతాల్లో పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు సంయుక్త తనిఖీలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, డీపీఓ సాయికుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సాయుధ దళాల పతాక దినోత్సవానికి మహిళా సంఘాల నుంచి రూ.6.92 లక్షల విరాళం

కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మకు చెక్కు అందజేత

అత్యధిక విరాళాలు సేకరించిన ఏపీఎంలకు సర్టిఫికెట్లు



గుంటూరు, అక్టోబర్ 12: (మహా న్యూస్): సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా మహిళా సంఘాలు రూ.6.92 లక్షల విరాళం అందించాయి. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మకు డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి. విజయలక్ష్మి అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశ రక్షణ కోసం సేవలందిస్తున్న సైనికులు, మాజీ సైనికులు, యుద్ధంలో గాయపడిన సైనికులు, అమర జవాన్ల కుటుంబాల సంక్షేమానికి మహిళా సంఘాలు విరాళం అందించడం అభినందనీయమన్నారు. ప్రజలు పతాక చిహ్నాలను స్వీకరించి విరాళాలు అందించడం ద్వారా సైనికుల సంక్షేమ కార్యక్రమాలకు సహకరించాలని కోరారు. దేశ రక్షణలో సైనికులు చేసిన త్యాగాలను స్మరించుకోవడం, వారికి కృతజ్ఞతలు తెలియజేయడం, వారి కుటుంబాలకు అండగా నిలవడం పతాక దినోత్సవం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అత్యధిక మొత్తంలో విరాళాలు సేకరించిన ఏపీఎంలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక్ సంక్షేమ అధికారి ఆర్. గుణశీల, డీఆర్‌డీఏ ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు వేగవంతం చేయాలి

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలి ఎన్నికల సన్నద్ధతపై అధికారులకు శిక్షణ ఇవ్వాలి జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల



నరసరావుపేట, అక్టోబర్ 12: (మహా న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఎన్నికల నిర్వహణపై నోడల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అత్యంత సమస్యాత్మక, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఎన్నికల సామగ్రి కొనుగోలు, పోస్టల్ బ్యాలెట్ బాక్సుల ఏర్పాటు, పోలింగ్ సిబ్బంది నియామకం, బ్యాలెట్ పత్రాల ముద్రణకు ప్రింటింగ్ ప్రెస్ ఖరారు వంటి అంశాలను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. ఎన్నికల సన్నద్ధతపై రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులకు నిపుణుల ద్వారా శిక్షణ అందించాలని అన్నారు. ఎన్నికల నిర్వహణను సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు మీడియా, కంట్రోల్ రూమ్‌ల ఏర్పాట్లను కూడా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల సూచించారు.

రైతు బజార్‌లో నాణ్యమైన బియ్యం విక్రయ కేంద్రం ప్రారంభం

సరసమైన ధరలకు నాణ్యమైన బియ్యం అందించడమే లక్ష్యం

బీపీటీ బియ్యం కిలో రూ.49, కేఎన్ఎం/ఆర్ఎన్ఆర్ బియ్యం కిలో రూ.50

ధరల నియంత్రణ చర్యల్లో భాగంగా విక్రయ కేంద్రం ఏర్పాటు



తిరుపతి, అక్టోబర్ 12: (మహా న్యూస్): తిరుపతి జిల్లా రైతు బజార్‌లో నాణ్యమైన బియ్యం విక్రయ కేంద్రాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్, ఈఓఈడీ ఆర్. గోవిందరావు ఐఏఎస్ ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ (ఏపీఎన్‌సీఎస్‌సీఎల్), తిరుపతి జిల్లా ఆధ్వర్యంలో మార్కెటింగ్ శాఖ సహకారంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల మేనేజర్, జిల్లా పౌర సరఫరాల అధికారి తదితరులు పాల్గొన్నారు. బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలు అధికంగా ఉన్న నేపథ్యంలో ప్రజలకు సరసమైన ధరలకు నాణ్యమైన బియ్యం అందించేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని జాయింట్ కలెక్టర్ తెలిపారు. వినియోగదారులపై ధరల భారాన్ని తగ్గించి, నాణ్యమైన బియ్యాన్ని అందుబాటులోకి తీసుకురావడమే విక్రయ కేంద్రం ఏర్పాటు ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.



విక్రయ ధరల వివరాలు:

బీపీటీ బియ్యం కిలో రూ.49, 26 కిలోల బ్యాగు రూ.1,274.

కేఎన్ఎం/ఆర్ఎన్ఆర్ బియ్యం కిలో రూ.50, 26 కిలోల బ్యాగు రూ.1,300.

ఈ కేంద్రం ద్వారా నిర్ణీత ధరలకు బియ్యం విక్రయిస్తూ ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన బియ్యం అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. తిరుపతి జిల్లా ప్రజలు రైతు బజార్‌లో ఏర్పాటు చేసిన ఈ విక్రయ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకుని తమ అవసరాలకు అనుగుణంగా బియ్యం కొనుగోలు చేయాలని జాయింట్ కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 275 అర్జీలు

అత్యధికంగా రెవెన్యూ శాఖకు 140 అర్జీలు

అర్జీదారుల సమస్యలకు నాణ్యమైన పరిష్కారం చూపాలి

పెండింగ్ లేకుండా, బాధితులు సంతృప్తి చెందేలా చర్యలు తీసుకోవాలి



తిరుపతి, అక్టోబర్ 12: (మహా న్యూస్): తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి మొత్తం 275 అర్జీలు అందాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులకు కుర్చీలు, తాగునీరు, వైద్య శిబిరం, గ్రామాల నుంచి వచ్చిన వారికి టీ తదితర సౌకర్యాలు కల్పించి, వారి సమస్యలను అధికారులు సావధానంగా వింటూ అర్జీలు స్వీకరించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు శివశంకర్ నాయక్, నాగార్జున, రామాంజనమ్మ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి అర్జీదారులకు రసీదులు అందించారు. ఈ సందర్భంగా పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులకు సూచించారు. అర్జీదారుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించరాదని, గడువు దాటిన పెండింగ్ అర్జీలు లేకుండా, బాధితులు సంతృప్తి చెందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

శాఖల వారీగా అందిన అర్జీల వివరాలు:




రెవెన్యూ – 140, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ – 8, హోంశాఖ – 18, పంచాయతీరాజ్ – 27, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ – 1, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ – 5, ఎస్ఎస్ఎల్ఆర్ – 16, గ్రామీణాభివృద్ధి – 5, స్వర్ణ గ్రామం స్వర్ణ వార్డు – 4, విద్యుత్ శాఖ – 4, ఆర్టీసీ – 1, పౌర సరఫరాలు – 4, తుడా – 1, ఫ్యామిలీ వెల్ఫేర్ – 4, విద్యాశాఖ – 4, ఇరిగేషన్ – 5, ఆరోగ్యశాఖ – 3, సమగ్ర శిక్ష – 1, బీసీ సంక్షేమం – 2, ఏపీఐఐసీ – 2, వికలాంగుల శాఖ – 1, నీటి వనరుల శాఖ – 1, ఉపాధి శాఖ – 1, గ్రామీణ పేదరిక నిర్మూలన – 1, టిడ్కో – 1, పద్మావతి యూనివర్సిటీ – 1, వ్యవసాయ శాఖ – 2, కాలుష్య నియంత్రణ శాఖ – 1, కార్మిక శాఖ – 1, గృహ నిర్మాణ శాఖ – 1, ఇంటర్మీడియట్ బోర్డు – 1, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ – 2, సాంఘిక సంక్షేమం – 2, పశుసంవర్ధక శాఖ – 1. వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 275 అర్జీలు అందినట్లు అధికారులు తెలిపారు.

తిరుపతి కలెక్టరేట్‌లో జిల్లా సైనిక సంక్షేమ శాఖ కార్యాలయం ప్రారంభం

కార్యాలయాన్ని ప్రారంభించిన సైనిక సంక్షేమ శాఖ సంచాలకుడు సత్య ప్రసాద్

తిరుపతి జిల్లాలో 8 వేల మంది మాజీ సైనికులు

మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యులు, వితంతువులు సేవలను సద్వినియోగం చేసుకోవాలి



తిరుపతి, అక్టోబర్ 12: (మహా న్యూస్): తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా సైనిక సంక్షేమ శాఖ కార్యాలయాన్ని సోమవారం సైనిక సంక్షేమ శాఖ సంచాలకుడు సత్య ప్రసాద్ ప్రారంభించారు. తిరుపతి జిల్లాలో సుమారు 8 వేల మంది మాజీ సైనికులు ఉన్న నేపథ్యంలో వారికి మరింత చేరువగా సేవలు అందించాలనే ఉద్దేశంతో కొత్త కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. దేశ భద్రత కోసం సేవలందించిన మాజీ సైనికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లా కలెక్టర్ సహకారంతో ఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. తిరుపతి జిల్లాలోని మాజీ సైనికులు, వారిపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబ సభ్యులు, వితంతువులు ఈ కార్యాలయం ద్వారా అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి కె.వి. రాఘవులు కోరారు. ఈ కార్యక్రమంలో విజయవాడ సైనిక సంక్షేమ శాఖ సంచాలకుల కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ బాలాజీ, అనంతపురం జిల్లా సైనిక సంక్షేమ అధికారి, చిత్తూరు జిల్లా కార్యాలయ సిబ్బంది, తిరుపతి జిల్లా మాజీ సైనికుల అధ్యక్షులు ఆనంద రెడ్డి, మనోహర్ రెడ్డి, మాజీ సైనిక సభ్యులు, వితంతువులు పాల్గొన్నారు.



ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 277 వినతులు స్వీకరణ

అర్జీలను గడువులోగా పరిష్కరించాలి భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలి

అధికారులకు కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాలు



చిత్తూరు, అక్టోబర్ 12: (మహా న్యూస్): ప్రజా సమస్యలను వేగంగా, పారదర్శకంగా, నిబంధనల ప్రకారం పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. సోమవారం చిత్తూరు జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్‌లో ప్రజల నుంచి 277 వినతులు స్వీకరించారు. వీటిలో 234 రెవెన్యూ క్లినిక్‌కు సంబంధించినవి కాగా, ఇతర శాఖలకు 43 వినతులు అందాయి. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, గడువులోగా పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పెండింగ్ అర్జీలపై నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని, పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకూడదని స్పష్టం చేశారు. భూసమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, రీసర్వే పూర్తయిన గ్రామాల్లో సరిహద్దు వివాదాలు, రికార్డుల్లో తప్పులు, విస్తీర్ణ వ్యత్యాసాలకు సంబంధించిన ఫిర్యాదులను ప్రాధాన్యతతో పరిష్కరించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ 1100 టోల్‌ఫ్రీ సేవ ద్వారా అందే ఫిర్యాదులను కూడా బాధ్యతగా పరిష్కరించాలని, అర్జీదారులతో నేరుగా మాట్లాడిన తర్వాతే నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. మాట్లాడిన తేదీ, సమయాన్ని తప్పనిసరిగా నమోదు చేయాలని, మండల స్థాయి అధికారులు పీజీఆర్ఎస్‌కు హాజరై ప్రజలకు 1100 సేవలపై అవగాహన కల్పించాలని సూచించారు. శాఖల వారీగా రెవెన్యూ, సర్వే శాఖకు 234, డీఆర్‌డీఏకు 9, మున్సిపల్ శాఖకు 7, పంచాయతీరాజ్‌కు 5, పశుసంవర్ధక శాఖకు 5, పోలీస్, పౌరసరఫరాల శాఖలకు చెరో 3, నీటిపారుదల, రిజిస్ట్రేషన్లు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖలకు చెరో 2, ఇతర శాఖలకు వినతులు అందాయి. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకటేష్, ఆర్డీవోలు శ్రీనివాసుల నాయుడు, భవాని, డిప్యూటీ కలెక్టర్లు పుల్లారెడ్డి, మధుసూదన్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


తిరుపతిలో రూ.3,222 కోట్ల అభివృద్ధి పనులకు నేడు శ్రీకారం

అమరావతి నుంచి వర్చువల్‌గా పనులను ప్రారంభించనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

భక్తులకు వసతి, అన్నప్రసాదం, రవాణా, పార్కింగ్ సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం

టీటీడీ ఉద్యోగుల కోసం 418 ఎకరాల్లో నివాస లేఅవుట్ అభివృద్ధి

తిరుపతి నగరంలో రూ.242 కోట్లతో 9 మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణం



తిరుపతి, అక్టోబర్ 12: (మహా న్యూస్): తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో రూ.3,222 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు నేడు శ్రీకారం చుట్టనున్నారు. అమరావతి నుంచి మధ్యాహ్నం 12 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు వర్చువల్‌గా ఈ పనులను ప్రారంభించనున్నారు. శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు టీటీడీ ఉద్యోగుల సొంతింటి కలను సాకారం చేయడం, తిరుపతి నగరంలో రహదారుల అభివృద్ధి లక్ష్యంగా ఈ పనులు చేపడుతున్నారు. భక్తుల కోసం రూ.1,332 కోట్లతో వసతి సముదాయాలను నిర్మించనున్నారు. నాలుగు బ్లాకుల్లో 2,700 గదులు ఏర్పాటు చేసి రోజుకు 15 వేల మంది భక్తులకు వసతి కల్పించనున్నారు. రూ.160 కోట్లతో నిర్మించే అన్నప్రసాద కేంద్రంలో ఒకేసారి 6 వేల మంది భక్తులకు అన్నప్రసాదం అందించేలా ఏర్పాట్లు చేయనున్నారు. అలాగే రూ.486 కోట్లతో నాలుగు పిలిగ్రిమ్ ఎమినిటీస్ కాంప్లెక్స్‌లను నిర్మించనున్నారు. వీటి ద్వారా ఒకేసారి 16 వేల మంది భక్తులకు స్నానం, విశ్రాంతి సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. రూ.311 కోట్లతో 4,500 వాహనాలు నిలిపే బహుళ అంతస్తుల పార్కింగ్ సముదాయాన్ని, రూ.90 కోట్లతో 30 బస్ బేలతో ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్ట్ టెర్మినల్‌ను నిర్మించనున్నారు. భక్తులకు వసతి, అన్నప్రసాదం, రవాణా, పార్కింగ్,





వైద్య సేవలను ఒకేచోట అందుబాటులోకి తీసుకురానున్నారు. తిరుమల కొండపై రద్దీని తగ్గించే లక్ష్యంతో తిరుపతిలో వసతి సౌకర్యాలను విస్తరించనున్నారు. పిలిగ్రిమ్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్, డిజిటల్ సమాచార కేంద్రంతో పాటు అత్యవసర వైద్య సహాయ కేంద్రాలు, ఆధునిక భద్రతా వ్యవస్థలను ఏర్పాటు చేయనున్నారు. టీటీడీ ఉద్యోగుల కోసం 418 ఎకరాల్లో రెండు దశల్లో 5,192 మందికి ఇళ్ల స్థలాలు కేటాయించనున్నారు. నివాస లేఅవుట్‌లో మౌలిక వసతుల కల్పనకు రూ.230 కోట్లు ఖర్చు చేయనున్నారు. అంతర్గత బీటీ రోడ్లు, డ్రైనేజీ, నీటి సరఫరా, విద్యుత్ సదుపాయాలను అభివృద్ధి చేయనున్నారు. ఇక తిరుపతి నగరంలో రూ.242 కోట్లతో 9 మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణానికి కూడా శ్రీకారం చుట్టనున్నారు. ఈ పనుల ద్వారా నగరంలో రవాణా సదుపాయాలు, మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు చేపట్టనున్నారు.

తిరుపతిలో అపోలో ఫార్మసీస్‌లో 159 ఉద్యోగాలకు మెగా జాబ్ డ్రైవ్

అక్టోబర్ 14న ఉదయం 9.30 గంటల నుంచి ఇంటర్వ్యూలు

ఫార్మసీ అసిస్టెంట్లు, ట్రైనీలు, ఫార్మసిస్టులు సహా పలు పోస్టులు

నెలకు రూ.16 వేల నుంచి రూ.22 వేల వరకు వేతనం



తిరుపతి, అక్టోబర్ 12: (మహా న్యూస్): నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో అక్టోబర్ 14న తిరుపతిలో మెగా జాబ్ డ్రైవ్ నిర్వహించనున్నారు. అపోలో ఫార్మసీస్ లిమిటెడ్‌లో మొత్తం 159 ఉద్యోగ ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆర్. లోకనాధం తెలిపారు.

ఉద్యోగాలు, అర్హతలు, వేతనాల వివరాలు:

ఫార్మసీ అసిస్టెంట్లు -- 50 పోస్టులు. ఇంటర్మీడియట్ లేదా ఏదైనా డిగ్రీతో పాటు మెడికల్ స్టోర్‌లో పని అనుభవం ఉండాలి. నెలకు రూ.17,500 నుంచి రూ.22,000 వరకు వేతనం.

ఫార్మసీ ట్రైనీలు -- 50 పోస్టులు. ఇంటర్మీడియట్, బీఏ, బీకామ్, బీఎస్సీ కంప్యూటర్స్ లేదా బీఎస్సీ బయాలజీ అర్హత ఉండాలి. నెలకు రూ.16,000 నుంచి రూ.17,000 వరకు వేతనం.

ఆడిటింగ్ అసిస్టెంట్లు -- 8 పోస్టులు. ఎంబీఏ లేదా ఏదైనా పోస్ట్ గ్రాడ్యుయేషన్ అర్హత ఉండాలి. నెలకు రూ.17,500 నుంచి రూ.19,000 వరకు వేతనం.

ఫార్మసిస్టులు -- 50 పోస్టులు. డీ.ఫార్మ్, బీ.ఫార్మ్ లేదా ఎం.ఫార్మ్‌తో పాటు ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ) సర్టిఫికెట్ తప్పనిసరి. పురుషులు, మహిళలు అర్హులు. నెలకు రూ.19,000 నుంచి రూ.21,000 వరకు వేతనం.

హెచ్ఆర్ ఎగ్జిక్యూటివ్ -- 1 పోస్టు. ఎంబీఏ, ఎంహెచ్ఆర్ఎం లేదా ఏదైనా డిగ్రీతో పాటు సంబంధిత రంగంలో కనీసం మూడేళ్ల అనుభవం ఉండాలి. కంపెనీ నిబంధనల ప్రకారం వేతనం, భత్యాలు అందిస్తారు. అభ్యర్థుల వయస్సు 20 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉండాలి. ఫార్మసీ అసిస్టెంట్లు, ఫార్మసీ ట్రైనీలు, ఆడిటింగ్ అసిస్టెంట్ల పోస్టులకు పురుష అభ్యర్థులు మాత్రమే అర్హులు. ఉద్యోగ ప్రాంతాలు తిరుపతి, రేణిగుంట, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేటగా ఉన్నాయి. ఎంపికైన అభ్యర్థులకు కంపెనీ పేరోల్‌పై ఉద్యోగాలు కల్పించడంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్, నెలవారీ రూ.1,000 నుంచి రూ.6,000 వరకు ఇన్సెంటివ్‌లు, వార్షిక వేతన పెంపు, బోనస్, సెలవులు, గ్రాట్యుటీ, ఇన్సూరెన్స్, శిక్షణ, కెరీర్ అభివృద్ధి అవకాశాలు కంపెనీ నిబంధనల ప్రకారం కల్పించనున్నారు.

ఇంటర్వ్యూ వివరాలు:

తేదీ: అక్టోబర్ 14, బుధవారం

సమయం: ఉదయం 9.30 గంటల నుంచి

వేదిక: అపోలో ఫార్మసీస్ లిమిటెడ్, రాయలసీమ ఆఫీస్, ఈశ్వరి బాలాజీ నిలయం, స్టార్లిట్ సూట్స్ పక్కన, చింతలచేను, కొత్త రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో, తిరుపతి -- 517501. అభ్యర్థులు తమ రెజ్యూమ్, విద్యార్హత ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ కాపీలు, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు, నాలుగు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో ఇంటర్వ్యూకు హాజరుకావాలి. ఆసక్తి గల అభ్యర్థులు ఖుఅజూబఅ-ఖుఎఖుజూ.శ్రశీఅ.అఅ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. మరిన్ని వివరాలకు 8886086072, 9988853335 నంబర్లను సంప్రదించాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆర్. లోకనాధం తెలిపారు.

తిరుపతిలో రూ.3,222 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం


ఇంటిగ్రేటెడ్ పిలిగ్రిమ్ టౌన్‌షిప్‌తో భక్తులకు మెరుగైన వసతులు

టీటీడీ ఉద్యోగుల ఇళ్ల స్థలాల లేఅవుట్‌కు రూ.230 కోట్లతో మౌలిక వసతులు

4,500 వాహనాల పార్కింగ్, 6 వేల మందికి అన్నప్రసాదం అందించే ఏర్పాట్లు

రూ.242.12 కోట్లతో 9 మాస్టర్ ప్లాన్ రోడ్ల అభివృద్ధి

తిరుమలలో యాత్రికుల కోసం ఏఐ ఆధారిత యాప్




తిరుపతి, అక్టోబర్ 12: (మహా న్యూస్): తిరుపతి, తిరుమల ప్రాంతాల్లో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, ట్రాఫిక్ రద్దీని తగ్గించడం, నగరాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడం లక్ష్యంగా పలు అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందించారు. టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడు మాట్లాడుతూ, ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్‌తో తిరుమల కొండపై రద్దీ తగ్గుతుందని, 2018 నుంచి కొనసాగుతున్న ఆలోచన కార్యరూపం దాల్చడం సంతోషకరమని తెలిపారు. పనులను రెండేళ్లలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించినట్లు పేర్కొన్నారు. టీటీడీ ఈఓ ఎం. రవిచంద్ర మాట్లాడుతూ, ఉద్యోగుల ఇళ్ల స్థలాల లేఅవుట్‌లో తాగునీరు, డ్రైనేజీ, అంతర్గత రహదారులు, విద్యుత్ తదితర మౌలిక వసతుల కోసం సుమారు రూ.230 కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్‌లో నాలుగు బ్లాకుల్లో వసతి సముదాయాలు, 4,500 వాహనాలకు బహుళ అంతస్తుల పార్కింగ్, ఒకేసారి 6 వేల మంది అన్నప్రసాదం స్వీకరించేలా భోజన సముదాయాలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. టీటీడీ ఏఈఓ వెంకయ్య చౌదరి మాట్లాడుతూ, తిరుమలలో ఆలయాలు, గదుల కేటాయింపు కేంద్రాలు, బస్‌స్టాప్‌లు, తాగునీరు, మరుగుదొడ్లు, వైద్య కేంద్రాలు తదితర సదుపాయాలను గుర్తించేందుకు ఏఐ ఆధారిత యాప్ రూపొందించినట్లు తెలిపారు. తెలుగు సహా ఐదు భాషల్లో వాయిస్ కమాండ్ ద్వారా మార్గాలు, సమీప సదుపాయాల వివరాలు తెలుసుకోవచ్చన్నారు. జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ మాట్లాడుతూ, తుడా, టీటీడీ నిధులతో రూ.242.12 కోట్ల అంచనా వ్యయంతో తొమ్మిది మాస్టర్ ప్లాన్ రోడ్లను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయానికి అనుసంధానంగా రూ.115 కోట్లతో మూడు రహదారులను అభివృద్ధి చేసి, పర్యాటక బస్సులకు పార్కింగ్ సదుపాయాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. శెట్టిపల్లిలో హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్లు, ఐటీ పార్కుల



అభివృద్ధితో పాటు అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం ఏర్పాటుకు ప్రతిపాదనలు ఉన్నాయని తెలిపారు. తుడా చైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ, రహదారుల విస్తరణ, పార్కింగ్, ఐటీ హబ్‌లు, విద్యాసంస్థలు, పరిశ్రమల అభివృద్ధితో ట్రాఫిక్ సమస్యలు తగ్గడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. టీటీడీ ఉద్యోగి జి. వెంకటేష్ మాట్లాడుతూ, 30 ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఇళ్ల స్థలాల కల సాకారం కావడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులకు జాయింట్ కలెక్టర్, తుడా వైస్ చైర్మన్ ఆర్. గోవిందరావు కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యాత్మక మైన పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఇన్స్పెక్టర్ కత్తి శ్రీనివాసులు



చిత్తూరు జిల్లా/ బంగారుపాళ్యం మహి న్యూస్.అక్టోబర్ 12.: చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండల పరిధిలోని జడ్పిటిసి ఎంపిటిసి సర్పంచ్ ఎలక్షన్లు త్వరలో రానున్న తరుణంలో సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలను తన సిబ్బందితో కలిసి ఇన్స్పెక్టర్ కత్తి శ్రీనివాసులు పరిశీలించారు. స్థానిక పరిస్థితులు, కేంద్రాలలో తీసుకోవలసిన జాగ్రత్తలు, వీటిపై పోలింగ్ కేంద్రాలను పరిశీలించడం జరిగిందని తెలిపారు. సుమారు మండలంలోని 41 పంచాయతీలలో సోమవారం 10 పంచాయతీలను పరిశీలించడం జరిగింది అని తెలిపారు. తుంబ కుప్పం ఈచినేరు పల్లి నల్లంగాడు తుంబపాల్యం పెరుమాళ్ళపల్లి ఎన్ కోటూరు కరిడివారి పల్లి మిగతా పంచాయతీలలో పర్యవేక్షించినట్లు ఇన్స్పెక్టర్ కత్తి శ్రీనివాసులు తెలిపారు. ఎలక్షన్లలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా పాల్గొనాలని అక్కడున్న ప్రజలకు సూచించినట్లు ఇన్స్పెక్టర్ కత్తి శ్రీనివాసులు తెలిపారు.



పెండింగ్ ఇళ్ల నిర్మాణాలను అక్టోబర్ 30లోగా ప్రారంభించాలి

రైతు రిజిస్ట్రీ పెండింగ్ దరఖాస్తులను అక్టోబర్ 13 సాయంత్రంలోగా పరిష్కరించాలి ఈ-పంట

ఈ-కేవైసీని అక్టోబర్ 17లోగా పూర్తి చేయాలి కలెక్టర్ డా. ఏ. సిరి ఆదేశాలు



కర్నూలు, అక్టోబర్ 12: (మహి న్యూస్): జిల్లాలో గృహ నిర్మాణాలు, రైతు రిజిస్ట్రీ, ఈ-పంట ఈ-కేవైసీ ప్రక్రియలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వివిధ ప్రభుత్వ కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను అక్టోబర్ 30లోగా ప్రారంభించాలని, ఆదోని పట్టణ పరిధిలో పెండింగ్‌లో ఉన్న 575 ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఎమ్మిగనూరు పరిధిలో నిర్మించాల్సిన 784 మరుగుదొడ్ల పనులను వేగవంతం చేసి, నెలవారీ లక్ష్యాలతో పూర్తి చేయాలన్నారు. రైతు రిజిస్ట్రీలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను అక్టోబర్ 13వ తేదీ సాయంత్రంలోగా పరిష్కరించాలని రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ-పంట ఈ-కేవైసీ ప్రక్రియను అక్టోబర్ 17వ తేదీలోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాల్లో వాట్సాప్ గవర్నెన్స్ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణాలను డిసెంబర్ 15లోగా పూర్తి చేయాలని సూచించారు. ఆదోని, ఎమ్మిగనూరు ప్రాంతాల్లో గోశాలలకు స్థలాలు గుర్తించాలని, పీజీఆర్ఎస్ ఫిర్యాదులను గడువులోగా పరిష్కరించి ప్రజల సంతృప్తిని పెంచాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో సి. వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పీడీ నరసింహారెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.




ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం ఉండకూడదు

అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారాలు అందించాలి స్థానిక సంస్థల ఎన్నికల విధులపై అధికారులకు పూర్తి అవగాహన ఉండాలి కలెక్టర్ డా. ఏ. సిరి



కర్నూలు, అక్టోబర్ 12: (మహి న్యూస్): ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావులేకుండా, అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారాలు అందించాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ప్రజల నుంచి వివిధ సమస్యలపై వినతులు స్వీకరించారు. ప్రతి అర్జీని ప్రాధాన్యతతో పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. పిటిషనర్లకు ఇచ్చే ఎండార్స్‌మెంట్లు స్పష్టంగా, సులభంగా అర్థమయ్యేలా ఉండాలన్నారు. ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత అధికారులు అర్జీదారులతో మాట్లాడి, క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పీజీఆర్ఎస్‌లో నమోదవుతున్న రీఓపెన్, సరైన పరిష్కారం లభించని కేసుల సంఖ్యను తగ్గించాలని ఆదేశించారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై అధికారులకు పూర్తి అవగాహన ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్నికల విధులు, శిక్షణ, సిబ్బంది కేటాయింపు, పోస్టల్ బ్యాలెట్ తదితర అంశాలకు సంబంధించిన మార్గదర్శకాలు, మాన్యువల్స్‌ను పూర్తిగా అధ్యయనం చేయాలన్నారు. నోడల్ అధికారులు తమ విధులు, బాధ్యతలపై స్పష్టతతో వ్యవహరించి, ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటనారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు అనురాధ, రామసుబ్బయ్య, శివ ప్రసాద్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



కల్లూరు అర్బన్‌లో రూ.40 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ

శ్రీనివాస నగర్‌లో పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి





కర్నూలు, అక్టోబర్ 12: (మహి న్యూస్): కల్లూరు అర్బన్ 34వ వార్డు శ్రీనివాస నగర్‌లో రూ.40 లక్షల నిధులతో చేపట్టనున్న నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు పాణ్యం ఎమ్మెల్యే, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు గౌరు చరిత రెడ్డి భూమిపూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ కే. పార్వతమ్మ, శ్రీశైలం దేవస్థానం బోర్డు సభ్యురాలు శివమ్మ, వార్డు నాయకులు పి.యు. మాదన్న, జవ్వాజి గంగాధర్ గౌడ్, భాస్కర్ గౌడ్, వెంకటేశ్వర రెడ్డి, రఫీ, మున్సిపల్ అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితుల బాండ్ల పరిశీలన, నమోదు కార్యక్రమం

అక్టోబర్ 13 నుంచి 17 వరకు ప్రత్యేక కార్యక్రమం సంబంధిత పత్రాలతో హాజరుకావాలని సీఐడీ అధికారుల సూచన

కర్నూలు, అక్టోబర్ 12: (మహి న్యూస్) : అగ్రిగోల్డ్ బాధితుల బాండ్ల పరిశీలన, నమోదు కార్యక్రమాన్ని అక్టోబర్ 13 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు కర్నూలు ప్రాంతీయ సీఐడీ కార్యాలయం అడిషనల్ ఎస్పీ ఎన్. పూజిత తెలిపారు. అక్టోబర్ 13న కర్నూలు జిల్లా గూడూరు మండలం, నంద్యాల జిల్లా మిడుతూరు, పగిడ్యాల మండలాలకు చెందిన బాధితులకు బాండ్ల పరిశీలన, నమోదు నిర్వహిస్తారు. అక్టోబర్ 14 నుంచి 17వ తేదీ వరకు నంద్యాల జిల్లా సిరివెళ్ల, కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలాల బాధితులకు ఈ కార్యక్రమం చేపడతారు. కర్నూలు నగరంలోని రామలింగేశ్వర నగర్‌లో, ఏపీ టూరిజం హోటల్ సమీపంలోని ప్రాంతీయ సీఐడీ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నమోదు ప్రక్రియ జరుగుతుంది. సంబంధిత పత్రాలతో హాజరై బాండ్ల పరిశీలన, నమోదు చేయించుకోవాలని అగ్రిగోల్డ్ బాధితులకు అధికారులు సూచించారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 83 ఫిర్యాదులు

ఉద్యోగాల పేరుతో డబ్బులు తీసుకొని మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధితుల వినతులు ఫిర్యాదులపై చట్టప్రకారం విచారణ జరిపి న్యాయం చేస్తాం కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు, అక్టోబర్ 12: (మహి న్యూస్): ప్రజా సమస్యలపై అందిన ఫిర్యాదులను చట్టప్రకారం విచారించి బాధితులకు న్యాయం చేస్తామని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. సోమవారం కొత్తపేటలోని టూ టౌన్ పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి వినతులు స్వీకరించి,



వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి మొత్తం 83 ఫిర్యాదులు అందాయి.

ఉద్యోగాల పేరుతో మోసం చేశారని ఫిర్యాదులు

కర్నూలు కప్పల్ నగర్‌కు చెందిన జమ్మన్న తన భార్యతో పాటు మరో ఇద్దరికి విద్యుత్ శాఖలో సబ్‌స్టేషన్ ఆపరేటర్, కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి రూ.14 లక్షలు తీసుకొని మోసం చేశారని ఫిర్యాదు చేశారు. ఆదోనికి చెందిన షేక్షావలి ప్రభుత్వ వెటర్నరీ శాఖలో ఇద్దరికి ఉద్యోగాలు ఇప్పిస్తామని రూ.5 లక్షలు తీసుకున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు. నంద్యాలకు చెందిన సునీత కలెక్టర్ కార్యాలయంలో ఉద్యోగం ఇప్పిస్తామని రూ.4 లక్షలు తీసుకొని మోసం చేసిన వ్యక్తిపై ఫిర్యాదు చేశారు.

దాడులు, భూ ఆక్రమణపై వినతులు

దేవనకొండ మండలం పి. కోటకొండకు చెందిన హుస్సేన్ బీ తనపై, తన భర్తపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. హాలహర్వి మండలం గూల్యం గ్రామానికి చెందిన లక్ష్మీకాంత్ తమ పొలాన్ని ఆక్రమించుకునేందుకు దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. అందిన ఫిర్యాదులన్నింటిపై చట్టప్రకారం విచారణ జరిపి, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) హుస్సేన్ పీరా, సీఐలు శివశంకర్, రామకృష్ణ, మస్తాన్ వలి పాల్గొన్నారు.

ఆడపిల్లలను కాపాడుదాం.. సమాన అవకాశాలు కల్పిద్దాం

లింగ వివక్షను రూపుమాపి సమానత్వ సమాజ నిర్మాణానికి కృషి చేయాలి బాలికలపై అవగాహన లఘుచిత్ర పోటీల విజేతలకు నగదు బహుమతులు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి



నంద్యాల, అక్టోబర్ 12: (మహి న్యూస్): ఆడపిల్లల రక్షణ, మహిళా సాధికారత, లింగ సమానత్వంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని నంద్యాల జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పిలుపునిచ్చారు.




అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థులకు నిర్వహించిన లఘుచిత్ర పోటీల విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పించి, వారి ప్రతిభను గుర్తించాలని సూచించారు. ఆడపిల్లల పట్ల వివక్ష చూపడం, గర్భస్థ శిశువు ఆడపిల్ల అని తెలుసుకుని గర్భస్రావానికి పాల్పడటం చట్టవిరుద్ధమన్నారు. ప్రతి శిశువుకు జీవించే హక్కు కల్పించాలని, బాలికల హక్కులను పరిరక్షించడంతో పాటు భ్రూణ హత్యలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. లింగ నిర్ధారణ పరీక్షలు, లింగ నిర్ధారణ ఆధారంగా గర్భస్రావాలను నిరోధించేందుకు పీసీపీఎన్‌డీటీ చట్టం-1994 అమల్లో ఉందని, ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

లఘుచిత్ర పోటీల్లో విజేతలు

ఆరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు పాల్గొన్న పోటీల్లో మూడు కళాశాలలు బహుమతులు సాధించాయి.

ప్రథమ బహుమతి రూ.30,000: పి.ఎస్.ఎ. మరియు కె.వి.ఎస్.సి. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నంద్యాల.

ద్వితీయ బహుమతి రూ.20,000: ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆళ్లగడ్డ.



తృతీయ బహుమతి రూ.10,000: ఎస్.జి.టి.ఆర్.యం. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎర్రగుంట్ల.

లఘుచిత్రాల ద్వారా బాలికల హక్కులు, రక్షణ, సంక్షేమం, సమానత్వంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. విజేతలైన కళాశాలల విద్యార్థులను అభినందించి, భవిష్యత్తులోనూ సామాజిక బాధ్యతతో కూడిన కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు.

ప్రజా సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి

పీజీఆర్ఎస్‌కు 276 దరఖాస్తులు రెవెన్యూ క్లినిక్‌ల ద్వారా 148 అర్జీల స్వీకరణ జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి

నంద్యాల, అక్టోబర్ 12: (మహి న్యూస్): ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో నిర్వహించిన ప్రజా పరిష్కార వేదికలో ప్రజల





నుంచి 276 దరఖాస్తులు స్వీకరించారు. పెండింగ్ అర్జీలు గడువు దాటకుండా పరిష్కరించాలని, ముఖ్యంగా రీ-ఓపెన్ అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. అర్జీదారులతో నేరుగా మాట్లాడి సమస్యల మూలాలను గుర్తించి నాణ్యమైన పరిష్కారం అందించాలని ఆదేశించారు.

రెవెన్యూ క్లినిక్‌ల ద్వారా 148 అర్జీలు


భూ సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న రెవెన్యూ క్లినిక్‌ల ద్వారా మొత్తం 148 అర్జీలు అందాయి. వీటిలో అసైన్డ్ భూములు, భూ ఆక్రమణలకు సంబంధించి 58, రెవెన్యూ కోర్టు విచారణలు, ఆర్ఓఆర్‌కు సంబంధించి 35, సర్వే, రీ-సర్వేలకు 15, చుక్కల భూములు, 22-ఎ భూములు, క్రమబద్ధీకరణకు 14, దేవాదాయ, వక్ఫ్ భూములకు 14, అడంగల్ సవరణలకు 8, రెవెన్యూ, గ్రామ/వార్డు సచివాలయ సేవలకు సంబంధించి 4 దరఖాస్తులు ఉన్నాయి. క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల ప్రకారం సమస్యను పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. పీజీఆర్ఎస్‌లో నంద్యాల పట్టణంలోని పొన్నాపురం కాలనీ 80 అడుగుల రహదారిలో సిమెంట్ రోడ్డు, మున్సిపల్ పైప్‌లైన్ సౌకర్యాలు కల్పించాలని వినతులు అందాయి. ఆత్మకూరు మండలానికి చెందిన టి. శ్రీనివాసరెడ్డి ఇంటి స్థలం మంజూరు చేయాలని, రుద్రవరం మండలం డి. కొట్టాల గ్రామానికి చెందిన వెంకటరమణకు రెండేళ్లుగా రైతు భరోసా నిధులు జమ కాకపోవడంతో సమస్య పరిష్కరించాలని అర్జీలు సమర్పించారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి రాము నాయక్, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి ఉమామహేశ్వరి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



క్షేత్రస్థాయి పరిశీలనతో సమస్యలకు పరిష్కారం చూపాలి

ప్రజా ఫిర్యాదుల వేదికకు 18 అర్జీలు అధికారులు ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇవ్వాలి నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు

కర్నూలు, అక్టోబర్ 12: (మహి న్యూస్): నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సత్వర పరిష్కారం చూపేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు సూచించారు. ప్రజలతో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకోవడం ద్వారా వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకుని సమర్థవంతమైన చర్యలు తీసుకోవచ్చని పేర్కొన్నారు. సోమవారం ఎస్‌బీఐ ఎంప్లాయీస్ కాలనీలోని నగరపాలక సంస్థ సమావేశ భవనంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో మొత్తం 18 అర్జీలు స్వీకరించారు. అర్జీలను సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్.జి.వి. కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ఎస్ఈ రమణమూర్తి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం. రఘు, డీసీపీ శబ్నం శాస్త్రీ, ఏసీపీ నాగరాజు, మేనేజర్ జునైద్, ఆర్వోలు క్రిస్టోఫర్, వాజిద్ తదితర అధికారులు పాల్గొన్నారు.



పేదరికం చదువుకు అడ్డంకి కాకూడదు

అనాథ విద్యార్థిని ఉన్నత విద్యకు కలెక్టర్ భరోసా కళాశాల ఫీజు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి

నంద్యాల, అక్టోబర్ 12: (మహి న్యూస్): కుటుంబ సభ్యులను కోల్పోయి కష్టాల్లో ఉన్న ఇంటర్మీడియట్ విద్యార్థిని గురులక్ష్మి ప్రసన్న ఉన్నత విద్యకు నంద్యాల జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అండగా నిలిచారు.

సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో నిర్వహించిన ప్రజా పరిష్కార వేదికలో విద్యార్థినితో మాట్లాడి, ఆమె చదువుకు అవసరమైన సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. గత ఏడాది చాగలమర్రి మండలం చిన్నగొంగలి గ్రామంలో వర్షాల కారణంగా మట్టిమిద్దె కూలిన ఘటనలో గురులక్ష్మి ప్రసన్న కుటుంబ సభ్యులను కోల్పోయింది. అయినప్పటికీ ధైర్యంగా చదువును కొనసాగిస్తూ ఇంటర్మీడియట్‌లో మంచి మార్కులు సాధించడంపై కలెక్టర్ అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం బాధిత కుటుంబానికి ఇప్పటికే రూ.10 లక్షల పరిహారం అందించిందని, విద్యార్థిని భవిష్యత్తు కోసం రూ.2 లక్షలను ఆమె అమ్మమ్మకు అందించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థినికి కళాశాల ఫీజు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పేదరికం, ప్రతికూల పరిస్థితులు చదువుకు అడ్డంకులు కాకూడదని, పట్టుదలతో లక్ష్యాలను సాధించాలని విద్యార్థినికి కలెక్టర్ సూచించారు. ఆమె విద్యాభ్యాసం నిరాటంకంగా కొనసాగేందుకు జిల్లా యంత్రాంగం సహకరిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి రాము నాయక్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

RNI : APTEL/25/A0108
మహా న్యూస్ www.mahinewsindia.com
తెలుగు దినపత్రిక
epaper: https://epaper.mahinewsindia.com

శ్రీకృష్ణ దేవాలయ నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి

కడప జిల్లా/జమ్మలమడుగు, మహి న్యూస్ అక్టోబర్ 12:: జమ్మలమడుగు మండలం గూడెం చెరువు గ్రామపంచాయతీ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో శ్రీకృష్ణ దేవాలయ నిర్మాణానికి నిర్వహించిన భూమి పూజ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, మార్కెట్ యార్డు ఉపాధ్యక్షుడు మల్లికార్జున, మండల పార్టీ అధ్యక్షుడు రామయ్య, లక్ష్మిరెడ్డి, రామరాజు, భాస్కర్, శేఖర్, వెంకటరాముడు, అంజన్ కుమార్, నాని, గోపాల్, సుబ్బారెడ్డితో పాటు స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌లో సమస్య.. వెంటనే పరిష్కారం!

గూడెంచెరువులో మూడు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు



కడప జిల్లా/జమ్మలమడుగు, మహి న్యూస్ అక్టోబర్ 12: జమ్మలమడుగు మండలం గూడెంచెరువు గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ల కొరతతో నెలకొన్న విద్యుత్ సమస్యకు పరిష్కారం లభించింది. జమ్మలమడుగు టీడీపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో గ్రామస్థులు తమ విద్యుత్ సమస్యను టీడీపీ జిల్లా అధ్యక్షుడు భూపేష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. గ్రామస్థుల సమస్యపై వెంటనే స్పందించిన భూపేష్‌రెడ్డి విద్యుత్ అధికారులను ఆదేశించడంతో సోమవారం గూడెంచెరువు గ్రామంలో మూడు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. దీంతో గ్రామంలో విద్యుత్ సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించేందుకు చొరవ చూపిన భూపేష్‌రెడ్డికి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

కో ఆర్డినేషన్ కమిటీ నిర్వాహక్ దల్ గా రెడ్డి ప్రసాద్



రాయచోటి , మహిన్యూస్ అక్టోబర్ 12: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహకంలో భాగంగా క్షేత్రస్థాయి సమాచారాన్ని సేకరించి పార్లమెంట్ కో ఆర్డినేషన్ కమిటీ వారికి అందించేందుకు అసెంబ్లీ కో ఆర్డినేషన్ కమిటీని జనసేన పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నియమించారు. ఇందులో భాగంగా రాయచోటి పట్టణానికి చెందిన రెడ్డి ప్రసాద్ ను కో ఆర్డినేషన్ కమిటీ నిర్వాహక్ దల్ గా రెడ్డి ప్రసాద్ నియమించారు. ఈ సందర్భంగా రెడ్డి ప్రసాద్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి నాకు ఈ పదవి కట్టబెట్టిన అధ్యక్షులు, ఉప మంత్రి పవన్ కళ్యాణ్ కు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ గెలుపుకు తన వంతు కృషి చేస్తానన్నారు. అంతేకాకుండా పార్టీలోనే అందరినీ కలుపుకొని పార్టీ అభ్యున్నతికి పాటుపడతానన్నారు.

మత్స్యకారులకు చేపల వేటకు అనుమతి

జూలై 1 నుంచి చేపల వేటకు అనుమతి.. అక్టోబర్ 13న వేలం

కడప జిల్లా మహి న్యూస్ అక్టోబర్ 12: వైఎస్సార్ కడప జిల్లాలోని మత్స్య అభివృద్ధి శాఖ పరిధిలో ఉన్న పెండ్లూరు చెరువు తదితర జలవనరుల్లో చేపల వేటకు సంబంధించి అధికారులు కీలక ప్రకటన విడుదల చేశారు. 2026 జూలై 1 నుంచి 2027 జూన్ 30 వరకు చేపల పట్టుబడికి సంబంధించిన హక్కులను కేటాయించేందుకు వేలం నిర్వహించనున్నట్లు మత్స్యశాఖ అధికారులు తెలిపారు.

అక్టోబర్ 13న వేలం నిర్వహణ

మత్స్యశాఖ పరిధిలోని చెరువుల్లో చేపల వేట హక్కుల కేటాయింపు కోసం 2026 అక్టోబర్ 13వ తేదీ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వేలం నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

వేలంలో పాల్గొనాలంటే నిబంధనలు

వేలంలో పాల్గొనదలచిన వారు ముందుగా నిర్ణయించిన నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకోవాలి. ప్రతి బిడ్డర్ రూ.1,000 చొప్పున ధరావతు మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది. రిజర్వు ధర మొత్తం రూ.22,825గా నిర్ణయించినట్లు ప్రకటనలో పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే ఆసక్తి ఉన్న మత్స్యకారులు సంబంధిత మత్స్యశాఖ అధికారులను సంప్రదించి పూర్తి వివరాలు, నిబంధనలు తెలుసుకోవాలని అధికారులు సూచించారు.

ప్రజా ఫిర్యాదులపై ఆర్డీఓ ప్రత్యేక దృష్టి

అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి



కడప, మహి న్యూస్ అక్టోబర్ 12: కడప రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో రెవెన్యూ డివిజనల్ అధికారి ఎ. మురళి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజలు భూ వివాదాలు, పట్టాదారు పాసుపుస్తకాలు, రేషన్ కార్డులు, పింఛన్లు, ఇంటి స్థలాలు తదితర సమస్యలపై వినతిపత్రాలు సమర్పించారు. అర్జీదారుల సమస్యలను స్వయంగా



పరిశీలించిన ఆర్డీఓ సంబంధిత తహసీల్దార్లు, శాఖాధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించడంతోపాటు నివేదిక సమర్పించాలని అధికారులకు స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఆర్డీఓ ఎ. మురళి తెలిపారు. ప్రజలు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకొని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

కడప రైతు బజార్‌లో బియ్యం ప్రత్యేక కౌంటర్లు ప్రారంభం

కిలో బీపీటీ బియ్యం రూ.49.. కేఎన్ఎం, ఆర్ఎన్ఆర్ బియ్యం రూ.50



కడప జిల్లా, మహి న్యూస్, అక్టోబర్ 12: ప్రజలకు నాణ్యమైన బియ్యాన్ని సరసమైన ధరలకు అందించాలనే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బియ్యం విక్రయాల కార్యక్రమంలో భాగంగా కడప రైతు బజార్‌లో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఈ కౌంటర్ల ద్వారా బీపీటీ బియ్యాన్ని కిలో రూ.49కు, కేఎన్ఎం, ఆర్ఎన్ఆర్ రకం బియ్యాన్ని కిలో రూ.50కు విక్రయించేందుకు ఏర్పాట్లు చేశారు. కడప రైతు బజార్‌లో ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక కౌంటర్లను జిల్లా సరఫరాల అధికారి, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్, కడప రెవెన్యూ డివిజనల్ అధికారి, కడప తహసీల్దార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు నాణ్యమైన బియ్యాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కడప రైతు బజార్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ల ద్వారా బియ్యాన్ని కొనుగోలు చేయాలని సూచించారు. బియ్యం విక్రయాలు ప్రభుత్వ నిర్దేశిత ధరల ప్రకారం జరిగేలా అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు.

ప్రజా ఫిర్యాదులపై బాధ్యతాయుతంగా స్పందించాలి..!

జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

ఎన్నికల కార్యక్రమాలపైనా దృష్టి సారించాలి




కడప, మహి న్యూస్ అక్టోబర్ 12: ప్రజా ఫిర్యాదులను బాధ్యతాయుతంగా పరిష్కరించి, మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సభాభవన్ లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.. జేసీ డా. నిధీమీనా తోకలిసి ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యమిస్తోందని, అధికారులు అలసత్వం



వీడి ప్రతి అర్జీపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి రెవెన్యూ క్లినిక్‌ల సేవలను వినియోగించుకోవాలని ప్రజలకు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా పనితీరు మెరుగ్గా ఉన్నప్పటికీ, అర్జీల పరిష్కారంలో జాప్యం జరగకుండా అన్ని శాఖల అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా పరిశీలించి, అర్జీదారులతో మాట్లాడి వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలని, సమస్యకు అనుగుణంగా సరైన పరిష్కారం చూపాలని ఆదేశించారు. పొంతనలేని నివేదికలు సమర్పించరాదని హెచ్చరించారు. తహసీల్దార్లు, శాఖాధిపతులు, ప్రజా సమస్యల పరిష్కార వేదిక సిబ్బంది ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి, సమాచార లోపాలు లేకుండా చూడాలని సూచించారు. పరిష్కరించిన అర్జీలపై ప్రజల సంతృప్తి స్థాయిని ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోందని, అందువల్ల ప్రతి ఫిర్యాదును నాణ్యతతో పరిష్కరించి అర్జీదారులకు న్యాయం జరిగేలా బాధ్యతాయుతంగా పనిచేయాలని తెలిపారు. అదేవిధంగా మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి చేపట్టాల్సిన కార్యక్రమాలను ముందుగానే గుర్తించి, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో మల్లికార్జునుడు, డిప్యూటీ కలెక్టర్ లు రంగస్వామి, వెంకటపతి, శివరామిరెడ్డి, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ జి. రాజ్యలక్ష్మి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దివంగత గజ్జల నారాయణ రెడ్డి 13వ వర్ధంతి సందర్భంగా అన్నదానం, వస్త్రదానం


ఖాజీపేట మహిన్యూస్ అక్టోబర్ 12: దివంగత గజ్జల నారాయణ రెడ్డి 13వ వర్ధంతిని పురస్కరించుకొని, ఆయన స్మృతికి ఘనంగా నివాళులు అర్పిస్తూ వెంకట లక్ష్మి సేవా సంస్థ ఆధ్వర్యంలో కడప జిల్లా ఖాజీపేట మండలం భూమాయిపల్లిలోని అమ్మ అనాథాశ్రమంలో అన్నదానం, వస్త్రదానం కార్యక్రమాలను నిర్వహించారు. మానవ సేవే మాధవ సేవ అనే స్ఫూర్తితో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఆశ్రమంలోని వారికి భోజనం అందించి, దుస్తులను పంపిణీ చేశారు. దివంగత గజ్జల నారాయణ రెడ్డి మద్య నిషేధ శాఖ వలయ పరిశీలకుడిగా సేవలు అందించారు. ఆయనను స్మరించుకుంటూ, ఆయన కుటుంబ సభ్యులు ప్రతి సంవత్సరం సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా మానవతా విలువలను చాటుతున్నారు. వ్యక్తి భౌతికంగా దూరమైనా, ఆయన జ్ఞాపకాలను సేవా కార్యక్రమాల రూపంలో సజీవంగా నిలుపుకోవచ్చనే సందేశాన్ని ఈ కార్యక్రమం అందించింది. ఈ కార్యక్రమానికి అమ్మ అనాథాశ్రమం సంస్థ అధ్యక్షులు మల్లారెడ్డి, వెంకట లక్ష్మి సేవా సంస్థ అధ్యక్షులు కూన ఈశ్వర్ రెడ్డి హాజరయ్యారు. వెంకట లక్ష్మి సేవా సంస్థ సభ్యులు పి.వి. కృష్ణారెడ్డి, భవాని తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో భాగస్వాములయ్యారు. దివంగత గజ్జల నారాయణ రెడ్డి కుమారుడు గజ్జల భాస్కర్ రెడ్డి, కోడలు గజ్జల సునీతా రెడ్డి, మనవరాలు జ్ఞానేశ్వరి రెడ్డి, మనవడు దీపక్ రెడ్డి, ఇతర కుటుంబ సభ్యులు ఈ సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. కుటుంబ సభ్యులు తమ ఆత్మీయుని జ్ఞాపకార్థం అన్నదానం, వస్త్రదానం నిర్వహించడం ద్వారా సమాజం పట్ల తమకున్న బాధ్యతను, పేదల పట్ల తమకున్న ఆదరణను చాటి



చెప్పారు. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం, అవసరంలో ఉన్నవారికి వస్త్రాలు అందించడం కేవలం దానం మాత్రమే కాకుండా, మానవత్వాన్ని పంచే గొప్ప కార్యమని ఈ కార్యక్రమం మరోసారి చాటి చెప్పింది. ఇటువంటి సేవా కార్యక్రమాలు సమాజంలో దయ, కరుణ, సహకారం, సేవాభావాలను పెంపొందించడంతో పాటు, యువతకు కూడా స్ఫూర్తినిస్తాయి. సేవే మాధవ సేవ – మానవ సేవే మాధవ సేవ అనే ఆశయాన్ని ఆచరణలో చూపించిన ఈ కార్యక్రమం, దివంగత గజ్జల నారాయణ రెడ్డికి అర్థవంతమైన నివాళిగా నిలిచింది.

పీజీఆర్ఎస్ అర్జీలను సకాలంలో నాణ్యతతో పరిష్కరించాలి

మదనపల్లి, మహి న్యూస్, అక్టోబర్ 12 : పి జి ఆర్ ఎస్ అర్జీలు సకాలంలో నాణ్యతతో పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలు నందు... ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ఆయా మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఓ ఏ. వెంకటేష్, ఎస్ డి సి లు చంద్రశేఖర్ రెడ్డి, మాధవరెడ్డి, నారాయణరెడ్డి, సర్వే శాఖ ఏడి శాంతరాజ్ ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జేసి మాట్లాడుతూ... ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ ల అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. అర్జీలను వేగవంతంగా, నాణ్యతగా పరిష్కరించాలన్నారు. ఎలాంటి పెండింగ్ లేకుండా అర్జీలను పరిష్కరించాలని, గ్రీవెన్స్ పై ఎప్పటికప్పుడు మానిటర్ చేయాలని, ఇందులో ఎలాంటి అలసత్వం ఉండరాదన్నారు. సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. అర్జీలను గడువులోపు అత్యంత నాణ్యతగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం గత కలెక్టర్ల సమావేశంలో నిర్దేశించిన లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. ప్రభుత్వం నిర్వహించే ఐవిఆర్ఎస్ కాల్స్ నందు పాజిటివ్ పర్సార్మెన్స్ (సానుకూల పనితీరు) ప్రజల నుండి సేకరించే అభిప్రాయాలలో పురోగతి సాధించాలని అన్నారు. అన్ని శాఖల అధికారులు వారి వారి శాఖలకు సంబంధించిన పనితీరుపై దృష్టి పెట్టి రాష్ట్రంలో జిల్లాను మెరుగైన స్థానంలో ఉండేలా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి



వివిధ సమస్యల పరిష్కారం కోసం సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలను కుర్చీలలో కూర్చొని వారి సమస్యలను తెలపగా జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్ తదితర అధికారులు వారి సమస్యలను సావధానంగా విన్నారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు.

ప్రజల నుండి అందిన విజ్ఞప్తులలో కొన్ని..

1. నిమ్మనపల్లి మండలం, కొండయ్య గారి పల్లి పంచాయతీ గుండ్రెడ్డి గారిపల్లి కు చెందిన కే వెంకటరమణ, నిరుపేదమైన తనకు వృద్ధాప్య పెన్షన్ వస్తోందని, ప్రస్తుతం నడుము వంగిపోయి లేవలేని నడవలేని పరిస్థితిలో ఉన్నాను. సదరంలో 75 శాతం వికలాంగత్వం సర్టిఫికెట్ ఇచ్చారు. వికలాంగుల పెన్షన్ మంజూరు చేయవలసిందిగా జాయింట్ కలెక్టర్ కు దరఖాస్తు సమర్పించుకున్నారు. 2.వాయల్పాడు మండలం మంచూరు గ్రామం సాకం వారి పల్లి మజరా కు చెందిన శ్రీ రాముల గారి భార్గవి, సెప్టెంబర్ మాసంలో తన భర్త మృతి చెందాడని, నిరుపేదలమైన తనకు జీవనాధారం పోయిందని, వితంతు పింఛను మంజూరు చేయవలసిందిగా జాయింట్ కలెక్టర్‌కు అర్జీని సమర్పించారు. 3.



రాయచోటి మండలం అబ్బవరం పోస్టు కుమార పల్లె గ్రామానికి చెందిన వి చిన్నపరెడ్డి, గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానంలో జూన్ 1999 నుండి పూజారిగా నిత్యం ధూప దీప నైవేద్య సేవలు నిర్వహిస్తున్నందున, ధూప దీప నైవేద్యం పథకం క్రింద గౌరవ భృతిని మంజూరు చేయవలసిందిగా జాయింట్ కలెక్టర్ కు అర్జీని సమర్పించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 433 అర్జీలు రాగా వాటిపై తగు చర్య తీసుకొని పరిష్కరించు నిమిత్తం సంబంధిత శాఖల అధికారులకు జాయింట్ కలెక్టర్ ఎండార్స్ చేయడం జరిగింది.

మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలి..!

ఎన్నికల సన్నద్ధతపై అధికారులకు జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఆదేశాలు

రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలి

కడప, మహి న్యూస్ అక్టోబర్ 12: త్వరలో నోటిఫికేషన్ వెలువడనున్న మున్సిపల్ ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని ముందస్తు ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా, సబ్ కలెక్టర్ హెచ్.ఎస్. భావన, జిల్లా రెవెన్యూ అధికారి కె. మల్లికార్జునుడుతో కలిసి కడప నగరపాలక సంస్థతో పాటు జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల కమిషనర్లు, సహాయ రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల విధులు కేటాయించిన అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానంగా రానున్న ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఇప్పటివరకు చేపట్టిన చర్యలను సమీక్షించి, తదుపరి చేపట్టాల్సిన పనులపై అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసే మార్గదర్శకాలు, విధివిధానాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికలతో పాటు గ్రామ పంచాయతీలు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన సన్నద్ధతపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి జాప్యానికి తావులేకుండా ప్రతి అంశాన్ని ముందస్తుగా ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని సూచించారు.



సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల గుర్తింపు ప్రక్రియను నిబంధనల ప్రకారం చేపట్టాలని, ఓటరు జాబితాల ప్రచురణకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. బ్యాలెట్ పెట్టెల సమీకరణ, బ్యాలెట్ పత్రాల ముద్రణకు అవసరమైన కాగితం సేకరణ, బ్యాలెట్ పత్రాల ముద్రణ, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, ఏర్పాటు వంటి అంశాలపై ముందస్తు కార్యాచరణ రూపొందించాలన్నారు. అదేవిధంగా ఎన్నికల విధుల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని గుర్తించి నియామక ప్రక్రియ చేపట్టాలని, మాస్టర్ ట్రైనర్ల ద్వారా ఎన్నికల సిబ్బందికి సమగ్ర శిక్షణ అందించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలు, ఎన్నికల సామగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రాలు, స్ట్రాంగ్ రూములు, ఓట్ల లెక్కింపు కేంద్రాలు, రవాణా సదుపాయాల ఏర్పాట్లపై గత ఎన్నికల అనుభవాలు, మార్గదర్శకాలను దృష్టిలో ఉంచుకుని తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికల విధులకు సిబ్బంది ఎంపికలో నిబంధనలను కచ్చితంగా పాటించాలని, ఎన్నికల ప్రక్రియలో ప్రత్యక్షంగా పాల్గొనే అధికారులు, సిబ్బందికి సంబంధించి నిర్దేశించిన అర్హతలు, నిబంధనలను పరిశీలించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల విధుల నుంచి మినహాయింపుల విషయంలోనూ నిబంధనలను మాత్రమే ప్రామాణికంగా తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నుంచి వెలువడే మార్గదర్శకాలు, ఎన్నికల షెడ్యూల్‌కు అనుగుణంగా అన్ని ఏర్పాట్లను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, నిష్పాక్షికతకు ప్రాధాన్యమిస్తూ, ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు.



EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT #1/704, PARK STREET, NEAR OLD BUSTAND, JAMMALAMADUGU-516434,YSR KADAPA DIST, A.P
PRINTED AT VSAR PRINTERS, YSR KADAPA DIST, 516004. RNI NO : APTEL/25/A0108. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com